ఉక్రేనియన్ జానపద గాథలు - 4

# ఎగిరే ఓడ



ఉక్రేనియన్ జానపద గాథలు - 4

# ఎగిరే ఓడ

అనువాదం : ఆర్వీయార్

మంచి పుస్తకం

Ukrainian Folk Tales

**ఉక్రేనియన్ జానపద గాథలు - 4**

**ఎగిరే ఓడ**

అనువాదం : ఆర్వీయార్

బొమ్మలు : వి. గొర్‌దియ్‌చుక్

"రాదుగ" ప్రచురణాలయం ద్వారా 1988లో సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

ప్రచురణ : సెప్టెంబరు, 2011

ప్రతుల సంఖ్య : 3000

వెల : రూ. 27/-

ISBN : 978-93-80153-59-9

ప్రచురణ, ప్రతులకు :

**మంచి పుస్తకం**

12-13-439, వీధి నెం. 1

తార్నాక, సికింద్రాబాదు - 500 017

ఫోన్ : 94907 46614.

email : info@manchipustakam.in

website : www.manchipustakam.in

ముద్రణ :

చరిత ఇంప్రెషన్స్

1-9-1126/బి, అజామాబాద్,

హైదరాబాదు - 500 020.

ఫోన్ : 040 - 2767 8411

# కథా క్రమం

ముందు మాట

1. ఎగిరే ఓడ ..... 05
2. దొర్లే బఠానీ గింజ ..... 16
3. మహిమ ఉన్న గుడ్డు ..... 30

అద్భుత లోకం గురించీ, ఆ లోకంలోని వీరుల గురించీ చెప్పే కమనీయ జానపద గాథలు ఒక తరాన్నించీ ఇంకో తరానికి ఏనాటినుంచో అందుతూనే ఉన్నాయి. లోకుల యుక్తి, చమత్కారం, హాస్యం తొణికిసలాడే గాథలు ఇవి. చాలా కాలం అవి మౌఖికంగానే ఉండిపోయాయి. శ్రోతలకి వాటిని వినిపించేవారు. అందుకనే వాటికి గాథలని పేరు వచ్చింది.

ఉక్రేనియన్ జానపద గాథలు అపారంగా ఉన్నాయి. పాతకాలం నాటి వీరుల్నీ, సంఘటనల్నీ ఈ గాథల్లో అడుగు అడుగునా మనం చూస్తాం. సామాన్య ప్రజలలో ధైర్యం ఉన్న మనుషులూ, ఉల్లాసం కలిగించే సాహసకృత్యాలు, చలాకీగా ఉండే జంతువులూ, పక్షులు పాఠకులకి సంతోషం కలిగిస్తాయి.

ప్రకృతి గురించీ, పెంపుడు జంతువుల గురించీ, అడవి జంతువుల గురించీ, పక్షుల గురించీ ప్రాథమిక జ్ఞానాన్ని జానపద గాథలు పిల్లలకి అందిస్తాయి.

# ఎగిరే ఓడ

పూర్వం ఒకప్పుడు ఒక ముసలి దంపతులు ఉండేవాళ్లు. వాళ్లకి ముగ్గురు కొడుకులు. వాళ్లల్లో ఇద్దరు తెలివైన వాళ్లు. మూడోవాడు తెలివిలేని వాడు. తల్లికీ, తండ్రికీ తెలివైన కొడుకుల పట్ల మక్కువ ఉండేది. తల్లి వాళ్లకి ప్రతి ఆదివారం తొడుక్కోడానికి మెరిసిపోయే తెల్లని చొక్కాలు ఇచ్చేది. కాని తెలివితక్కువ కొడుకుని మాత్రం ఎప్పుడూ తిడుతూ ఉండేది. వాడు పొయ్యి తీనెమీద పగలూ, రాత్రీ అలా పడుకునే ఉండేవాడు. మురికిఓడుతూ ఉండే చొక్కా తప్ప ఇంకేమీ వాడి వంటి మీద ఉండేది కాదు. అన్నం పెట్టడం మరిచిపోతే అలానే పస్తు ఉండేవాడు.

ఒక రోజు చక్రవర్తి పెద్ద విందు ఏర్పాటు చేస్తున్న వార్త వాళ్ల చెవినపడింది. గాలిలో ఎగిరే ఓడని తయారు చేసి, దానిమీద రాజ భవనానికి వచ్చిన వాళ్లకి తన కూతురుని ఇచ్చి పెళ్లి చేస్తాను అని చక్రవర్తి ప్రకటించాడు.

తెలివైన అన్నదమ్ములిద్దరూ ఏం చెయ్యాలా అని ఆలోచించారు.

"మనం ఆ విందుకి వెళ్లాలి. ఏమో ఏ పుట్టలో ఏ పాముందో! అదృష్ట దేవత మనల్ని వరించవచ్చునేమో," అని అనుకున్నారు. తల్లిదండ్రులకి ఆ విషయం చెప్పారు.

"మమ్మల్ని ఆ విందుకు వెళ్లనీయండి. ఇప్పుడున్న దానికంటే ఏం చెడిపోం. ఏమో అక్కడ అదృష్టం కలిసి రావచ్చు," అన్నారు.

వద్దని తల్లీ, తండ్రీ చెప్పి చూశారు. కాని వాళ్లు వినలేదు.

"మేం వెళ్లి తీరతాం నూరు ఆరైనా, ఆరు నూరైనా, అంతే. మాక్కావల్సిందల్లా మీ ఆశీర్వాదం," అన్నారు.

ఇక చేసేదేమీ లేక తల్లీ, తండ్రీ వాళ్లని ఆశీర్వదించారు. తల్లి వాళ్లకి కొన్ని రొట్టెలని, వేయించిన మాంసాన్ని, ఒక కూజా ఉక్రేనియన్ ఓద్కానీ ఇచ్చింది. అవి తీసుకుని వాళ్లు గుర్రాలను ఎక్కి వెళ్లిపోయారు.

తెలివితక్కువ వాడు పొయ్యి తీనెమీద కూర్చున్నాడు కదా మరి, వాడూ తల్లిని పిలిచాడు.

"వాళ్లు వెళ్లిన చోటికే నేనూ వెళతాను," అన్నాడు.

వాడి మాటలు విని మొదట తల్లీ, తండ్రీ నవ్వుకున్నారు. తర్వాత తిట్టడం మొదలుపెట్టారు. కాని వాడు ససేమిరా వినలేదు. దాంతో వాళ్లు వాడిని మానిపించే ప్రయత్నం వదులుకున్నారు.

తల్లి వాడికి ఒక కూజా మంచినీళ్లూ, మాడిపోయిన నల్ల రొట్టెముక్కా ఇచ్చింది.

"సరే వెళ్లు, ఇక మళ్లీ వెనక్కి రాకు. ఎవరన్నా అడిగినా నువ్వు మా అబ్బాయివని చెప్పకు," అని సాగనంపింది తల్లి.

తెలివితక్కువ వాడు అలా వెళ్లగా వెళ్లగా వాడికి ఒక ముసలతను ఎదురయ్యాడు. అతని గడ్డం తెల్లగా నెరిసిపోయింది, బారుగా ఛాతీ కిందకంటా పడుతోంది.

"నమస్కారం, తాతా," అన్నాడు తెలివితక్కువ వాడు.

"చిరంజీవి!" అని ముసలతను ఆశీర్వదించాడు.

"ఎక్కడికి వెళుతున్నావ్, తాతా?"

"నేనొక పరోపకారి పాపన్నని. ఎవరు కష్టాల్లో ఉంటే వాళ్లని ఆదుకుంటూ తిరుగుతాను. నువ్వెక్కడికి వెళుతున్నావ్?"

"రాజ భవనానికి, చక్రవర్తిగారు ఇచ్చే విందుకి."

"గాలిలో ఎగిరే ఓడని తయారు చెయ్యగలవా నువ్వు?"

"ఉహుం, చెయ్యలేను."

"ఇక వెళ్లేం లాభం అయితే?"

"ఏమో ఏం చెప్పగలం? ఇంతకంటే చెడిపోం కదా, కాలం కలిసొస్తే అదృష్టదేవత వరిస్తుందేమో," అన్నాడు వాడు.

"కూర్చో. కొంచెం విశ్రమించి, ఏదన్నా తిందాం. నీ మూటలో ఏముందేమిటి?"

"ఇంత రొట్టెముక్క తప్ప ఏమీ లేదు, తాతా. అది కూడా మాడిపోయింది. నువ్వు నోట్లో పెట్టుకోలేవు," అన్నాడు వాడు.

"ఫరవా లేదులే, దాన్నే తియ్యి."

తెలివితక్కువ వాడు మూట అందుకుని చూసేప్పటికి ఆ నల్ల రొట్టె మంచి రొట్టెగా మారిపోయి ఉంది. గొప్ప వాళ్లే అలాంటి రొట్టెని తింటూ ఉంటారు.

"కొంచెం చుక్క లేకుండా ఏం తింటాం? నీ దగ్గర ఓద్కా ఏం లేదా?" అని ముసలతను అడిగాడు.

"నా మొహానికి అంత ఇదా! ఒక కూజా నీళ్లున్నాయి."

"పోనీలే, అదే తియ్యి."

తెలివితక్కువ వాడు కూజా తీశాడు. ఒక గుక్క నోట్లో పోసుకున్నాడు. చిత్రం! నీళ్లు ఓద్కాలా మారిపోయాయి.

"ఇప్పుడు ఏమంటావ్?" అని ముసలతను అడిగాడు.

వాళ్లు వేసుకున్న కోటును నేలమీద పరిచి భోజనానికి కూర్చున్నారు. సుష్టుగా తిన్నారు. భోజనం పెట్టినందుకు సంతోషంగా ఉందని ముసలతను తెలివితక్కువ వాడితో అన్నాడు.

"చూడు బాబూ, అడవిలోకి వెళ్లి, ఒక చెట్టు ఎక్కి కూర్చొని గొడ్డలితో నరుకు. నేలమీద పడు. ఎవరన్నా వచ్చి లేపేదాకా అలానే ఉండిపో. అప్పటికి ఎగిరే ఓడ తయారవుతుంది. నువ్వు ఆ ఓడ ఎక్కి నీ ఇష్టం వచ్చిన చోటుకి ఎగిరివెళ్లు. కాని గుర్తుంచుకో, దారిలో కలిసిన వాళ్లందరినీ ఎక్కించుకోవాలి సుమా," అని చెప్పాడు.

తెలివితక్కువ వాడు ముసలతనికి కృతజ్ఞతలు చెప్పాడు. ఇద్దరూ ఒకరి దగ్గర మరొకరు సెలవు తీసుకుని వెళ్లిపోయారు. ముసలతను అదే దారిలో వెళ్లిపోయాడు. తెలివితక్కువ వాడు అడవిలోకి వెళ్లేదారి పట్టాడు.

అడవిలోకి వెళ్లి ఒక చెట్టు ఎక్కి గొడ్డలితో నరికాడు. తరవాత నేలమీద పడి నిద్రపోయాడు.

కొంత కాలం గడిచింది. ఎవరో తనని లేపుతున్నట్టు వాడికి అనిపించింది.

"లే, లే, అదృష్ట దేవత నిన్ను వరించబోతోంది," అని ఏదో కంఠం పిలిచింది.

తెలివితక్కువ వాడు ఒక్క ఉదుటున లేచి కళ్లు తెరిచాడు. చిత్రం! ఎదరుగా ఒక బంగారు ఓడ ఉంది. దాని తెరచాప కొయ్యలు వెండివి. తెరచాపలు పట్టువి. అవి గాలి తరంగాలలో అలల్లా ఊగుతున్నాయి. ఆ ఓడ యాత్రకి సర్వసన్నద్ధంగా ఉన్నట్టు కనిపించింది.

తెలివితక్కువ వాడు ఆ ఓడ ఎక్కాడు. అది నేలమీదనుంచి పైకి లేచి గాలిలో తేలింది. మేఘాలకి దిగువలోనే ఎగిరింది. వాడు చుట్టూతా చూశాడు కాని అంతా వాడి దృష్టికి ఆనలేదు.

అలా ఓడలో వెళుతూ ఉండగా ఒక మనిషి కలిశాడు. ఆ మనిషి తన చెవిని నేలకి ఆనించి ఏదో వింటున్నాడు.

"ఏమయ్యోయ్! కొత్తాయనా," అని తెలివితక్కువ వాడు పిలిచాడు.

"ఆఁ, ఏం?"

"ఏం చేస్తున్నావేమిటి?"

"చక్రవర్తిగారి విందుకి వచ్చే వాళ్లు పోగయ్యారో లేదో వింటున్నాను."

"నువ్వక్కడికి వెళుతున్నావా ఏమిటి?"



“ఆc.”

“అయితే నా ఓడ ఎక్కు, అక్కడికి తీసికెళతాను,” అన్నాడు వాడు.

నిశితకర్ణుడు ఓడ ఎక్కాడు. ఓడ ఎగిరి వెళ్లింది.

కొంతసేపు ప్రయాణం సాగాక వాళ్లకి ఒక మనిషి కలిశాడు. అతను ఒక కాలుని చెవికి కట్టేసుకుని రెండో కాలితో గెంతుకుంటూ వెళుతున్నాడు.

“ఏమయ్యోయ్,” అని వాళ్లు అతన్ని పిలిచారు.

“ఏం సంగతి,” అన్నాడతను.

“ఏం ఒంటి కాలితో గెంతుతున్నావ్?”

“నేను రెండు కాళ్లతో నడిచినట్టయితే ఈ భూమండలం దాటిపోతాను. అది ఇష్టం లేక,” అన్నాడు.

“ఎక్కడికి ప్రయాణం?”

“చక్రవర్తి మందిరానికి, విందుకి.”

“సరే అయితే ఎక్కు. అక్కడికి తీసికెళతాం,” అన్నారు.

శీఘ్రపాదుడు ఓడ ఎక్కాడు. ఓడ ఎగిరిపోయింది.

కొంతసేపు ప్రయాణం సాగాక వాళ్లకి ఒక వేటగాడు కనిపించాడు. అతను విల్లు ఎక్కుపెట్టి నుంచున్నాడు. కనుచూపు మేరలో ఒక పిట్టగానీ, జంతువుగానీ లేవు. అయినా బాణం వదలడానికి తయారుగా ఉన్నాడు.

“హేయ్! కొత్త మనిషీ? ఏమిటి నీ గురి? కనుచూపు మేరలో ఎక్కడా పిట్టలూ, జంతువులూ లేవే!” అన్నాడు తెలివితక్కువ వాడు.

“మీకు కనిపించక పోవచ్చు. కాని నాకు కనిపిస్తూ ఉంది.”

“ఓహో! అలాగా! అయితే నీకు కనిపించేదేమిటో చెప్పవయ్యా!”

“ఓ రాబందు ఇక్కడికి వందమైళ్ల దూరంలో ఎండిపోయిన చెట్టుమీద కూర్చుంది.”

“మాతో రా, ఎక్కు.”

నిశితాక్షుడు ఓడ ఎక్కాడు. ఓడ బయలుదేరింది.

కొంతసేపు ప్రయాణం సాగాక వాళ్లకి ఒక మనిషి కనిపించాడు. అతను ఒక బస్తా గోధుమలు భుజంమీద మోసుకుపోతున్నాడు.

“ఏమయ్యోయ్!” అని వాళ్లు అతన్ని పిలిచారు.

“ఏమిటయ్యా!” అన్నాడతను.

“ఎక్కడికేమిటి ప్రయాణం?”

“భోజనానికి రొట్టె తెచ్చుకుందామని వెళుతున్నా.”

“అదేమిటయ్యా ఆ బస్తా నిండా ఉందిగా.”

“ఆఁ ఉంది! ఇది ఒక పంటి కిందికి రాదు.”

“మాతో రాకూడదూ?”

“ఏ మాత్రం అభ్యంతరం లేదు,” అన్నాడతను.

అలా అని ఆ అమితభోజనుడు ఓడ ఎక్కాడు. ఓడ బయలుదేరింది.

కొంత దూరం ప్రయాణం సాగాక వాళ్లకి కింద ఒక సరస్సు కనిపించింది. దాని ఒడ్డున ఒక మనిషి ఉన్నాడు. అతను దేని కోసమో వెతుకుతున్నట్టు కనిపించాడు.

“ఏమయ్యోయ్,” అని వాళ్లు అతన్ని పలకరించారు.

“ఏమిటి, అయ్యలారా?” అన్నాడతను.

“దేని కోసం వెతుక్కుంటున్నావ్?”

“నీటికోసం. నాకు చాలా దాహంగా ఉంది, ఎక్కడా నీళ్లు కనిపించడం లేదు.”

“బావుందయ్యా, నీ ఎదురుగా నీటి సరస్సు ఉందిగా?”

“ఇది తాగడానికి చాలుతుందా? నాకు ఒక్క గుక్కకి రాదు.”

“మాతో రాకూడదూ?”

“అలాగే, దానికి అభ్యంతరం ఏమిటి?”

అమితపాయి ఓడ ఎక్కాడు. ఓడ బయలుదేరింది.

కొంత కాలం ప్రయాణం సాగింది. ఇంతలో వాళ్లకి ఒక గడ్డి మోపు పట్టుకెళుతున్న మనిషి కనిపించాడు.

“ఏమయ్యోయ్,” అని వాళ్లు అతన్ని పలకరించారు.

“ఎక్కడికి ఆ గడ్డి మోసుకుపోతున్నావ్?” అని అడిగారు.

“ఊళ్లోకి.”

“ఏం ఆ మాత్రం గడ్డి అక్కడ ఉండదా?”

“ఉండొచ్చు. కాని ఈ గడ్డి అలాంటిది కాదు.”

“అలాంటిది కాదూ? మరి ఎలాంటిది?”

“ఎలాంటిదంటే, దీన్ని నేలమీద పరిస్తే చాలు సెగలు పొగలుగా ఉండే వేసవి రోజున కూడా శీతాకాలం వచ్చేసి మంచు కురుస్తుంది,” అన్నాడు.

"మాతో రాకూడదా?"

"అలాగే వస్తా."

సర్వహిమకరుడు ఓడ ఎక్కాడు. ఓడ బయలుదేరింది.

అలా ఎంతసేపు ప్రయాణం చేశారో తెలీదు. కాని ఆఖరికి వాళ్లు చక్రవర్తి ప్రాసాదం చేరారు. ప్రాసాదం పెరటి భాగంలో మేజాలు సర్ది ఉన్నాయి. వాటినిండా రకరకాల భక్ష్యాలు ఉన్నాయి. పక్కనే ఉక్రేనియన్ ఓద్కా పీపాల కొద్దీ ఉంది. బీరు అలా కాలవలాగా పారింది. పొట్ట పట్టినంత తాగి, తిని తేన్చవచ్చు. సగం రాజ్యం అక్కడే పోగయింది. ముసలీ ముతకా, పడుచూ గిడుచూ, బీదా బిక్కీ, జమీందార్లు సామంతులు – ఒకళ్లనేమిటి, అదే పెద్ద తిరునాళ్లలాగా ఉంది. వాడి అన్నలు కూడా అక్కడే ఉన్నారు.

తెలివితక్కువ వాడూ, వాడి స్నేహితులూ ఎకాయెకీ చక్రవర్తి మందిరం దగ్గరికి వెళ్లారు. ఓడ దిగి విందు భోజనం చేసేవాళ్ల పంక్తిని  చేరారు.

చక్రవర్తి తెలివితక్కువ వాడికేసి చూశాడు. వాడి కోటు అంతా మాసికలే. పాంటునిండా చిరుగులే. వీడా ఎగిరే ఓడమీద వచ్చినవాడు అని ఆయనకి మతిపోయింది. గడ్డం పీక్కున్నాడు.

"నా కూతురుని ఇలాంటి పల్లెటూరి బైతుకిచ్చి పెళ్లిచెయ్యనా!" అని ఆయనకి బాధేసింది.

కాని మాట తప్పడం ఎలాగ? అందుకని తెలివితక్కువ వాడికి అనేక పరీక్షలు పెట్టాలనుకున్నాడు.

ఒక నౌకర్ని పిలిచి "ఎగిరే ఓడమీద వచ్చినంత మాత్రాన పండగ కాదు. విందు పూర్తయేలోగా ఆరోగ్యజలం తీసుకు రావాలి. లేకపోతే రాకుమారినిచ్చి పెళ్లి చెయ్యడం మాట అటుంచి తల తీయించేస్తాను," అని చెప్పమని పురమాయించాడు.

నిశితకర్ణుడు చక్రవర్తి పురమాయించిన మాటలు విన్నాడు. విన్నది తెలివితక్కువ వాడికి చెప్పాడు.

తెలివితక్కువ వాడు మిగిలిన అందరిలాగా ఒక బల్ల దగ్గర కూర్చున్నాడు. ఈ మాటలు విని వాడికి చాలా విచారం కలిగింది. ఏమీ తినలేకపోయాడు, తాగలేకపోయాడు.

వాడలా దిగాలుగా ఉండడం చూసి శీఘ్రపాదుడు కలవరపడ్డాడు.

"ఏం తినటం లేదు?" అని అడిగాడు.

"మింగుడు పడ్డంలేదు. విందు పూర్తయే లోపున ఆరోగ్యజలం తెమ్మని చక్రవర్తి ఆజ్ఞాపిస్తున్నాడు. ఎలా తీసుకురాను?" అన్నాడు.

"మరేం బాధపడకు. నేను తెస్తాను."

సరిగ్గా ఆ సమయంలో నౌకరు వచ్చి చక్రవర్తి ఆజ్ఞ చేరవేశాడు. అప్పుడు తెలివితక్కువ వాడు చక్రవర్తి ఆజ్ఞాపించినట్టే చేస్తానని తెలియచెయ్యమని నౌకరుకి చెప్పాడు.

నౌకరు వెళ్లిపోయాడు. శీఘ్రపాదుడు చెవికి కట్టుకున్న కాలు విప్పి ఒక్క అడుగు వేశాడు. అంతే సగం భూమండలం దాటేశాడు. క్షణం గడిచిందో లేదో రెండు కూజాలనిండా ఆరోగ్యజలం నింపాడు.

"కొంచెం అలిసిపోయినట్టున్నాను, కాసేపు ఈ చెట్టు పక్కన విశ్రమిస్తాను. విందు అయ్యే లోపున వెనక్కి వెళ్లిపోతా," అనుకున్నాడు.

అలా అనుకుని గానుగచెట్టు పక్కన కూర్చున్నాడు. ఇంతలో అతనికి తెలియకుండానే కునుకు పట్టేసింది.

విందు అయిపోవచ్చింది. కాని శీఘ్రపాదుడి జాడ లేదు. తెలివితక్కువ వాడి పై ప్రాణాలు పైనే పోతున్నాయి. ఇక తనపని గోవిందా అనుకున్నాడు వాడు.

నిశితకర్ణుడు నేలమీదకి చెవి ఆనించి విన్నాడు.

"శీఘ్రపాదుడిని తగలెయ్య! అక్కడ నిద్రపోతున్నాడు."

"ఇప్పుడేం చేద్దాం మరి? ఎలా అతన్ని లేపడం?" అని అడిగాడు తెలివితక్కువ వాడు.

"మరేం బెంగపడకు, నేను లేపుతాను," అన్నాడు నిశితాక్షుడు.

విల్లు సంధించి బాణం వదిలాడు. అది గానుగచెట్టుని గట్టిగా కొట్టుకుంది. ఆ దెబ్బకి పేడు ముక్కలు లేచి జల్లుగా పడ్డాయి. శీఘ్రపాదుడు లేచి ప్రాసాదానికి వచ్చాడు. విందు అయిపోవచ్చే వేళకి కూజాలతో ఆరోగ్యజలం తెచ్చి అందించాడు.

చక్రవర్తి ముఖం వెలగలేదు. తెలివితక్కువ వాడికి మరో పరీక్ష పెట్టాడు.

"అతడూ, అతడి మిత్రులూ పన్నెండు ఎద్దుల వేపుడునీ, పన్నెండు పొయ్యిల్లో కాల్చిన రొట్టెనీ ఒక్క వడ్డనకి తినెయ్యాలి. అప్పుడే రాకుమారినిచ్చి పెళ్లి చెయ్యడం. లేకపోతే వాడి తల తీయించేస్తాను. వెళ్లి వాడితో చెప్పు," అని నౌకరుని పిలిచి చక్రవర్తి పురమాయించాడు.

చక్రవర్తి నౌకరుతో చెప్పిన మాటలని నిశితకర్ణుడు విని తెలివితక్కువ వాడికి చెప్పాడు.

వాడికి కళ్లల్లో నీళ్ళు తిరగడమే తక్కువ.

"నా ఖర్మ, ఏం చెయ్యను? అంత తిండి ఒక్కసారి ఎవడు తినగలడు?" అన్నాడు.

"ఎందుకు బాధపడతావు? ఎవరి సాయం అక్కర్లేకుండానే ఒక్కడినీ అంతా లాగించేస్తాను," అన్నాడు అమితభోజనుడు.

సరిగ్గా ఆ సమయంలో చక్రవర్తి జారీ చేసిన ఆజ్ఞతో నౌకరు వచ్చాడు. తెలివితక్కువ వాడు అలాగే అంత తిండీ పట్టుకురమ్మని చెప్పాడు.

పన్నెండు ఎద్దుల్ని వేపుడు చేశారు. పన్నెండు పొయ్యిల్లో కాల్చిన రొట్టెని తెచ్చారు. అమిత భోజనుడు ఆ మొత్తాన్ని ఒక్క క్షణంలో గుటకాయ స్వాహా చేసేశాడు.

“ఏదీ, మారు వడ్డన చెయ్యండి, ఇంకా ఆకలి తీరలేదు,” అన్నాడు.

చక్రవర్తికి ముఖం ఇంకా మాడిపోయింది. ఇలా కాదు మరో పరీక్ష పెట్టాలనుకున్నాడు.

“ఆ తెలివితక్కువ వాడూ, వాడి మిత్రులూ కలిసి పన్నెండు పీపాల సారాయినీ, అన్ని పీపాల బీరునీ ఒక్క గుక్కలో తాగాలి. లేకపోతే వాడి తల తీయించేస్తాను,” అని చెప్పమని నౌకరుని పంపాడు.

నిశితకర్ణుడు ఈ మాటలు విని తెలివితక్కువ వాడితో చెప్పాడు. వాడు భోరున ఏడ్చాడు.

“మరేం బాధపడకు. నేను మొత్తం తాగేసి ఇంకా తెమ్మని అడుగుతాను,” అన్నాడు అమితపాయి.

చక్రవర్తి నౌకర్లు పన్నెండు పీపాల సారాయినీ అన్ని పీపాల బీరునీ పట్టుకువచ్చారు. అమితపాయి చుక్క మిగల్చకుండా తాగేశాడు.

ఎన్ని యుక్తులు పన్నినా లాభం లేకపోయిందని చక్రవర్తి గ్రహించాడు.

“వీడిని తగలెయ్య! వీడిని మట్టు పెట్టించాలి, లేకపోతే నా కూతురు బతుకు బండలవుతుంది,” అనుకున్నాడు.

ఆలోచించి ఒక నౌకరుని తెలివితక్కువ వాడి దగ్గరికి పంపాడు. పెళ్లికి ముందు వాడు ఆవిరి స్నానాల గదిలో బాగా ఆవిరి పట్టి స్నానం చెయ్యాలని చెప్పమన్నాడు. మరో నౌకరుని ఆవిరి స్నానాల గదిలో ఆవిరిని పెట్టే వాడి దగ్గరికి పంపాడు. కణకణ మండిపోయేటట్టుగా ఆవిరి గదిని రాజెయ్యమని చెప్పమన్నాడు.

“వెధవ, అక్కడ కుతకుత ఉడికిపోతాడు,” అనుకున్నాడు.

చక్రవర్తి చెప్పినట్టే ఆవిరి స్నానాల గదిని కణకణ రాజేశాడు ఆవిరి పెట్టేవాడు. ఆ వేడికి దెయ్యం కూడా ఉడికిపోయేట్టు ఉంది.

చక్రవర్తి ఏం పురమాయించాడో తెలివితక్కువ వాడికి తెలిసింది. వాడు సర్వహిమకరుడిని తీసుకుని ఆవిరి స్నానాల గదికి వెళ్లాడు. అతను అక్కడ గడ్డిని పరవగానే అది చప్పగా చల్లబడి పోయింది. ఒక బాల్చీడు నీళ్లు మీద దిమ్మరించుకున్న తెలివితక్కువ వాడు పొయ్యి తీనెమీదకి ఎక్కి గుర్రుకొట్టి నిద్రపోయాడు.

తెల్లవారింది. నౌకర్లు ఆవిరి స్నానాల గది తలుపులు తెరిచారు. తెలివితక్కువ వాడి బూడిద మిగులుతుంది అని వాళ్లు అనుకున్నారు. కాని తీరా చూస్తే, చిత్రం! వాడు ఆదమరిచి నిద్రపోతున్నాడు. వాడిని లేపడం చాలా కష్టమైంది.

“ఆయ్ఁ!” అంటూ వాడు ఆవలించి లేచి “ఎంత హాయిగా నిద్రపట్టింది,” అని ఆవిరి స్నానాల గదిలోనుంచి ఇవతలికి వచ్చాడు.

నౌకర్లు వెళ్లి చక్రవర్తికి ఈ విషయం చెప్పారు. తెలివితక్కువ వాడు పొయ్యి తీనెమీద ఆదమరిచి నిద్రపోయాడనీ, ఆవిరి స్నానాల గది గడ్డకట్టించేంత చలిగా ఉందనీ చెప్పారు.

ఏం చెయ్యాలో చక్రవర్తికి తోచలేదు. చాలాసేపు ఆలోచించాడు.

“పొరుగు రాజు మామీద దాడి చేయబోతున్నాడు. కాబట్టి నేను పెళ్లికొడుకులందరికీ పరీక్ష పెట్టాలనుకుంటున్నాను. అందరిలోకీ ఎక్కువ ధైర్యవంతుడైన యోధుడు ఎవరో అతనికి మా అమ్మాయినిచ్చి పెళ్లి చేస్తాను,” అన్నాడు.

ఎంతోమంది యువకులు యుద్ధానికి వెళ్లారు. తెలివితక్కువ వాడి అన్నలు కూడా తమ గుర్రాలను ఎక్కి వెళ్లారు. తెలివితక్కువ వాడికి పాపం గుర్రం కూడా లేదు. చక్రవర్తి దగ్గర గుర్రాలను కాసేవాడిని అడిగి ఒక ముసలి గుర్రాన్ని తీసుకున్నాడు. దానిమీద ఎక్కి కదిలీ కదలనట్టు స్వారీ చేశాడు. యోధులందరూ వాడిని దాటి ముందుకు వెళ్లారు. వాడు మాత్రం అదేచోట ఉండిపోయాడు.

అప్పుడు అడవినుంచి ముసలాయన వచ్చాడు, ఎగిరే ఓడని సంపాదించడానికి సాయం చేసిన పరోపకారి పాపన్న.

“బాధపడకు అబ్బాయి, నీకు సాయం చేస్తాను. పెద్ద అడవిగుండా వెళుతూ ఉంటే కుడి పక్కన నీకు పెద్ద కొమ్మలున్న చెట్టు కనిపిస్తుంది: “చెట్టూ, చెట్టూ, పక్కకి జరగవా!” అని అడుగు. అది పక్కకి జరుగుతుంది. దానికిందనుంచి స్వారీచెయ్యడానికి తయారుగా ఉన్న గుర్రం ఒకటి వస్తుంది. దాని జీనుకి ఒక మూట కట్టి ఉంటుంది. నీకు సాయం కావాలనుకుంటే ‘మూటనుంచి రా’ అని చెప్పు. ఏం జరుగుతుందో చూస్తావ్. ఇక సెలవ్,” అన్నాడు.

తెలివితక్కువ వాడు సంతోషించాడు. ఆ ముసలి గుర్రాన్ని వదిలిపెట్టి పరిగెత్తి అడవిలోకి వెళ్లాడు.

“చెట్టూ, చెట్టూ కొంచెం పక్కకి జరగవా!” అన్నాడు.

ఆ చెట్టు పక్కకి జరిగింది. దాని కిందనుంచి ఒక అద్భుతమైన గుర్రం వచ్చింది. దానికి బంగారు జూలు ఉంది. జీనుమీద యోధులకి అవసరమైన కత్తి, కవచం, డాలు ఉన్నాయి. ఒక మూట దానికి కట్టి ఉంది.

తెలివితక్కువ వాడు కవచం తొడుక్కుని “మూటనుంచి రా,” అని అరిచాడు.

అప్పుడు చాలా మంది సైనికులు లోపల నుంచి ఇవతలికి వచ్చారు.

తెలివితక్కువ వాడు గుర్రం ఎక్కి ముందుండి సైన్యాన్ని శత్రు రాజుమీదకి నడిపించాడు.

ఆ రాజుమీద దాడిచేసి అతని సైన్యాన్ని సంహరించి విజయం సాధించాడు. కాని దురదృష్టవశాత్తూ ఆఖరి క్షణంలో తెలివితక్కువ వాడి కాలికి గాయం అయింది.

అప్పటికి అసలు రాజూ, రాకుమారీ యుద్ధం చూడ్డానికి వచ్చారు. ఆ సాహస యోధుడికి గాయం అవడం చూసి రాకుమారి తన రుమాల్ని రెండుగా చింపి ఒక ముక్కతో గాయానికి కట్టు కట్టింది. రెండో ముక్కని తన దగ్గర ఉంచుకుంది.

యుద్ధం అయాక తెలివితక్కువ వాడు అడవిలోకి వెళ్లి చెట్టుని పక్కకి జరగమని చెప్పాడు.

చెట్టు పక్కకి జరిగింది, తెలివితక్కువ వాడు తనకి లభించిన వాటినన్నిటినీ అక్కడ దాచాడు. చిరిగిన చొక్కానీ, పాత లాగునీ తొడుక్కుని బయలుదేరాడు.

అప్పుడు రాజు తను చూసిన యోధుడిని తీసుకుని రమ్మని భటులను పంపించాడు. ఏ యోధుడి గాయానికి రాకుమారి కట్టుకట్టిందో, ఆ యోధుడి కోసం రాజభటులు వెతికారు. అతను ఎక్కడా కనిపించక పోవడంతో రాజు అతని కోసం బీదవాళ్ల మధ్య కూడా వెతకమని చెప్పాడు. రాజభటులు బీదవాళ్ల గుడిసెలన్నిటినీ గాలించారు. చివరికి ఊరు శివారులో ఇద్దరు అన్నలూ భోజనం చేస్తూ ఉండడం ఇద్దరు రాజభటులు చూశారు. తెలివితక్కువ వాడు వారికి భోజనం వడ్డిస్తున్నాడు. ఒక కాలికి రాకుమారి కట్టిన రుమాలు పీలిక ఉండడం కనిపించింది. వాడిని వెంటనే తీసుకెళ్లాలని వాళ్లు అనుకున్నారు.

శుభ్రంగా లేననీ స్నానంచేసి వస్తాననీ చెప్పి అతడు స్నానాల గదికి వెళ్లాడు.

రాజభటులు త్వరగా అలానే కానిమ్మన్నారు. తెలివితక్కువ వాడు అడవిలోకి పరిగెత్తి చెట్టు దగ్గరికి వెళ్లాడు.

“చెట్టూ, చెట్టూ పక్కకి జరుగు,” అన్నాడు.

చెట్టు పక్కకి జరిగింది. గుర్రం కనిపించింది. వాడు బట్టలు మార్చుకుని నవమన్మథుడిలా తయారయ్యాడు. గుర్రం ఎక్కి రాజు దగ్గరికి వెళ్లాడు. రాజూ, రాకుమారీ సంతోషించి ఆ యోధుడికి ఎంతో మర్యాద చేశారు.



# దొర్లే బఠానీ గింజ

అనగా అనగా ఒక ఊళ్లో ఒకతను ఉండేవాడు. అతనికి ఆరుగురు కొడుకులూ, ఒక కూతురూ ఉండేవారు. ఒక రోజున కొడుకులందరూ పొలం దున్నడానికి వెళుతూ చెల్లెలు అల్యోంకాని తమకి అన్నం పట్టుకురమ్మని చెప్పారు.

"మీరెక్కడుంటారో నాకెలా తెలుస్తుంది?" అని అల్యోంకా అడిగింది.

"నీకు ఆనవాలు కోసం మన ఇంటి దగ్గరనుంచి మేం ఉన్న చోటికి ఒక చాలు దున్నుతాం," అన్నారు వాళ్లు.

ఆమాట చెప్పి వాళ్లు వెళ్లిపోయారు.

ఆ పొలం అవతల ఒక అడవి ఉంది. అక్కడ ఒక మహాకాళం ఉంది. అన్నలు చేసిన చాలుని ఆ మహాకాళం మట్టితో కప్పేసింది. తన ఇంటికి అది చాలు చేసుకుంది. అల్యోంకా అన్నలకి అన్నం పట్టుకుని ఆ దారినే వెళ్లింది. తిన్నగా మహాకాళం పెరట్లోకి వెళ్లింది. మహాకాళం ఆమెని పట్టుకుని బందీ చేసింది.

సాయంత్రం అన్నలు ఇంటికి తిరిగివచ్చారు.

"మేం రోజంతా దున్నుతూనే ఉన్నాం. అన్నం పంపలేదేమమ్మా?" అని తల్లిని అడిగారు.

"పంపక పోవడమేమిట్రా! అన్నం సర్ది అల్యోంకాతో ఇచ్చి పంపానే! వెర్రిపిల్ల దారి తప్పిపోయిందేమో, పాపం," అందావిడ.

"అయ్యో, మనం అల్యోంకా కోసం వెతకాలి పదండి," అన్నారు అన్నలు.

వెంటనే బయలుదేరారు. మహాకాళం చేసిన చాలు చూసి ఆ దారినే వెళ్లారు. మహాకాళం ఇల్లు చేరుకున్నారు. పెరటి వాకిలి దాటి లోపలికి అడుగు వేశారు. వాళ్ల చెల్లెలు పరిగెత్తుకుంటూ ఎదురొచ్చింది.

“అన్నయ్యలూ! అన్నయ్యలూ! ఎక్కడ దాచను మిమ్మల్ని! మహాకాళం ఇప్పుడు బయటికి వెళ్లింది, తిరిగి రాగానే మిమ్మల్ని చంపేస్తుంది,” అని అరిచింది.

అంతలో మహాకాళం ఎగురుకుంటూ వాళ్లకేసి వచ్చేస్తోంది.

“నర వాసన! నరుల వాసన!” అని అది అరిచింది.

“ఆఁ! కుర్రాళ్లూ! నాతో యుద్ధం చెయ్యడానికి వచ్చారా, సంధి కుదుర్చుకుందుకా?” అని అడిగింది.

“యుద్ధం చెయ్యడానికే,” అన్నారు వాళ్లు.

“అయితే సరే,” అని ఇనప నూర్పిడి కల్లంలోకి వెళ్లారు. కాని వాళ్లు ఎక్కువసేపు యుద్ధం చెయ్యలేదు. ఆ మహాకాళం ఒక్క దెబ్బ కొట్టి వాళ్లని కూలగొట్టింది. తర్వాత పైకి ఎత్తింది. వాళ్లు కొన ఊపిరితో మిగిలారు. అప్పుడు వాళ్లని చీకటి కూపంలో పడేసింది మహాకాళం.

కొడుకులు ఇదిగో వస్తారు అదిగో వస్తారు అని తల్లీ, తండ్రీ ఎదురు చూస్తూనే ఉన్నారు. కాని వాళ్లు ఎంతకీ రారే!

ఒక రోజున వాళ్ల అమ్మ బట్టలు ఉతుకుదామని రేవుకి వెళ్లింది. చిత్రం! ఓ బఠానీ గింజ దొర్లుకుంటూ ఆమె దగ్గరికి వచ్చింది. ఆమె దాన్ని తీసుకుని తినేసింది.

కొంత కాలం గడిచాక ఆమెకి ఒక కొడుకు పుట్టాడు. వాడికి దొర్లే బఠానీ గింజ అని పేరు పెట్టారు.

దొర్లే బఠానీ గింజ గబగబా ఎదిగిపోయాడు. బాగా పెరిగాడు. వయసులో చిన్న అయినా బలంగా పెద్దవాడిలా అయ్యాడు.

ఒక రోజు వాడూ, వాళ్ల నాన్నా బావి తవ్వుతున్నారు. అప్పుడు వాళ్ల పారలకి ఒక రాయి తగిలింది. అది పెద్ద బండరాయి. దాన్ని ఎత్తాలి. సాయానికి ఇరుగుపొరుగు వాళ్లని పిలుచుకురావటానికి తండ్రి వెళ్లాడు. కాని ఆయన తిరిగివచ్చే లోపున వాడు ఒక్కడే దాన్ని ఎత్తేశాడు. ఇరుగుపొరుగు వాళ్లు వచ్చి చూసి ముక్కుమీద వేలేసుకున్నారు. అంతే కాదు భయపడిపోయారు కూడా. ఎలా చూసినా తమందరికంటే వాడు బలంగా ఉన్నాడయ్యే. నిజానికి వాళ్లు ఎంత భయపడ్డారంటే వాడిని చంపేద్దామనుకున్నారు. కాని దొర్లే బఠానీ గింజ ఆ బండరాయిని పైకి ఎగరేసి అది నేలమీద పడేలోపునే మళ్లీ పట్టుకున్నాడు. ఆ దెబ్బతో వాళ్లు పారిపోయారు.

తండ్రీ, కొడుకూ మళ్లీ తవ్వడం మొదలుపెట్టారు. అలా తవ్వుతూ ఉండగా వాళ్ల పారలకి పెద్ద ఇనప దిమ్మ తగిలింది. వాడు దాన్ని తీసి దాచిపెట్టాడు.

కొంత కాలం గడిచింది. ఒక రోజు వాడు తనకి ఆరుగురు అన్నలూ, ఒక అక్కా ఉండేవాళ్లట నిజమేనా అని తల్లిదండ్రుల్ని అడిగాడు.

"ఉండేవాళ్లు. కాని ఒకసారి వెళ్లిపోయి మళ్లీ తిరిగి రాలేదు," అని వాళ్లు జరిగిన సంగతి యావత్తూ అతడికి చెప్పారు.

"నేను వెళ్లి వాళ్లకోసం వెతుకుతాను," అని దొర్లే బఠానీ గింజ అన్నాడు.

"వద్దురా! బాబూ," అని తల్లీ, తండ్రీ వాడిని బతిమాలారు.

"వద్దు నాయనా. చెల్లెల్ని వెతికి తీసుకువస్తామని మీ అన్నలు వెళ్లారు. మళ్లీ తిరిగి రాలేదు. వాళ్లు ఆరుగురు! అయినా ఇలా అయింది. నువ్వో ఒక్కడివి!" అన్నారు.

"లేదు, నేను వెళ్లి తీరతాను. రక్తం పంచుకుని పుట్టాం మేం. నేను అంత తేలికగా వదలను," అన్నాడు వాడు.

వాడు తనకి దొరికిన ఇనప దిమ్మని కమ్మరి దగ్గరికి తీసికెళ్లాడు.

"దీంతో నాకో గద చేసి ఇయ్యి. ఎంత పెద్దదైతే అంత మంచిది," అన్నాడు.

ఆ కమ్మరి గదని తయారు చేసి ఇచ్చాడు. అది చాలా పెద్దది. దాన్ని కార్ఖానాలో నుంచి తీసికెళ్లాలంటేనే ఎంతో మంది కావాలి. అలాంటి దాన్ని వాడొక్కడూ సునాయాసంగా ఎత్తేసి ఆకాశంలోకంటా విసిరాడు.

"నేను నిద్రపోతాను. గద మళ్లీ కిందికి పడే వేళకి పన్నెండు రోజులు అవుతుంది. అప్పుడు నన్ను లేపండి," అని తండ్రికి చెప్పాడు.

అతను మంచం ఎక్కి పన్నెండు రోజులు నిద్రపోయాడు. పదమూడో రోజున గద కిందికి దిగింది. తండ్రి వాడిని లేపాడు. వాడు ఒక్క ఉదుటున లేచి వేలు పైకి ఎత్తాడు. వేలుకి తగిలి గద రెండుగా బద్దలైపోయింది.

"ఇలాంటి చవకబారు గద తీసుకుని అన్నయ్యలనీ, అక్కనీ వెదకడానికి వెళ్లలేను. ఇంకో గద కావాలి," అన్నాడు దొర్లే బఠానీ గింజ.

ఆ విరిగిపోయిన గదని తీసుకుని మళ్లీ కమ్మరి దగ్గరకెళ్లాడు.

"దీన్ని మార్చేసి కొత్త గద చేసియ్యి. నాకు సరిపడే దాన్ని చేసియ్యి," అన్నాడు.

కమ్మరి ముందటి దానికంటే పెద్ద గద చేసి ఇచ్చాడు. వాడు దాన్నీ గాలిలోకి పైకంటా విసిరి మంచం ఎక్కి ఇంకో పన్నెండు రోజులు పడకేశాడు. పదమూడో రోజున అది మళ్లీ కిందికి వచ్చింది. అది వస్తూ ఉంటే ఘోష వినబడింది. ఆ శబ్దానికి భూమి కంపించింది, అదిరింది. తల్లీ, తండ్రీ వాడిని లేపారు. వాడు ఒక్క ఉదుటున లేచి వేలు పైకి ఎత్తాడు. గద వేలుకి తగిలింది. బద్దలవలేదు కాని కొంచెం వంగింది.

"ఇదీ గద అంటే. ఇప్పుడు నా అన్నలనీ, అక్కనీ వెతకడానికి వెళతాను. అమ్మా, కొన్ని రొట్టెలు కాల్చియ్యి. కొన్ని అప్పచ్చులు కూడా చేసియ్యి. నేను బయలుదేరతాను," అన్నాడు వాడు.

గదనీ, సంచెడు అప్పచ్చుల్నీ, రొట్టెల్నీ తీసుకుని తల్లికీ, తండ్రికీ వెళ్లి వస్తానని చెప్పి బయలుదేరాడు.

మహాకాళం చేసిన పాత చాలులోనే వెళ్లాడు. కొంచెం సేపట్లోనే ఒక చిట్టడవి తగిలింది. అలా వెళ్లి వెళ్లి ఆఖరికి ఒక పెద్ద ఇల్లు చేరుకున్నాడు. ఆ ఇంటి చుట్టూ పెరడు ఉంది. ఆ పెరటికి చుట్టూతా కంచె కట్టి ఉంది. వాడు పెరట్లో నడుచుకుంటూ ఇంటి దగ్గరికి వెళ్లాడు. అక్కడ అక్క అల్యోంకా కనిపించింది. మహాకాళం ఎక్కడికో వెళ్లింది, అందుకే అక్క ఒక్కతే ఉంది.

"బాగున్నావా అమ్మాయ్?" అని వాడు పలకరించాడు.

"ఊఁ, నువ్వు బాగున్నావా, అబ్బాయ్! ఏం ఇలా వచ్చావ్? మహాకాళం కాసేపట్లో వచ్చేస్తుంది. నిన్ను మింగేస్తుంది," అని ఆ అమ్మాయి అంది.

"చూద్దాం, ఏం జరుగుతుందో. కాని నువ్వెవరు? ఇక్కడ ఎందుకున్నావ్?"

"మా అమ్మకీ నాన్నకీ నేను ఒకత్తినే కూతుర్ని. ఈ మహాకాళానికి చిక్కేదాకా వాళ్లతోనే ఉన్నాను. మా ఆరుగురు అన్నలూ నన్ను విడిపిద్దామని వచ్చారు. కాని, ప్చ్, విడిపించ లేకపోయారు."

"నీ అన్నలు ఇప్పుడెక్కడ ఉన్నారు?" అని వాడు అడిగాడు.

"ఆ మహాకాళం వాళ్లని చీకటి కూపంలోకి తోసేసింది. వాళ్లు బతికి ఉన్నారో లేదో కూడా నాకు తెలీదు."

"నేను నిన్ను విడిపించగలనేమో మరి," అన్నాడు దొర్లే బఠానీ గింజ.

"మా అన్నలు ఆరుగురు. వాళ్లు నన్ను విడిపిద్దామని ప్రయత్నించారు కాని విడిపించలేకపోయారు. నువ్వొక్కడివీ ఎలా విడిపించగలవ్?"

"చూద్దాం ఏం జరగబోతోందో," అన్నాడు దొర్లే బఠానీ గింజ.

అతను కిటికీ పక్కన చేరి మహాకాళం కోసం చూస్తూ కూర్చున్నాడు.

ఇంతలో మహాకాళం వచ్చింది. ఇంట్లోకి అడుగుపెట్టి వాసన చూసింది. "నరవాసన!" అంది.

"కావచ్చు, మరి నేను ఇక్కడ ఉన్నాగా," అని ముందుకు వస్తూ అన్నాడు దొర్లే బఠానీ గింజ.

"ఏం ఇలా వచ్చావ్ నాయనా? నాతో యుద్ధం చేద్దామని వచ్చావా లేక సంధి చేసుకుందామని వచ్చావా?"

"యుద్ధమే."

"అలాగా! అయితే ఇనప నూర్పిడి కల్లం దగ్గరికి పద."

"కానీ."

మహాకాళమూ వాడూ నూర్పిడి కల్లం దగ్గరికి వెళ్లారు. మహాకాళం వాడికి ఎదురుగా నుంచుంది.

"నువ్వు ముందు దెబ్బ కొట్టు," అంది మహాకాళం.

"వద్దులే, ముందు నువ్వే కానీ," అన్నాడు వాడు.

ఆ మాటతో మహాకాళం వాడిమీదకి ఎగిరి గట్టిగా కొట్టింది. ఆ దెబ్బకి వాడు సూర్పిడి కల్లంలో చీలమండ దాకా కూరుకుపోయాడు. కానీ రెప్ప మూసి తెరిచేలోగా బయటపడి మహాకాళాన్ని తన గదతో మోది మోకాలు లోతుకి దిగేశాడు. ఆ మహాకాళం బయటికి ఊడి పడి వాడినీ అంత లోతుకీ దిగేసింది. కాని వాడు బెదిరే మనిషా! వాడు మహాకాళాన్ని ఇంకో దెబ్బ కొట్టాడు. ఆ దెబ్బకి మహాకాళం నేలలోకి మొల లోతు కూరుకుపోయింది. అప్పుడు వాడు ఇంకో దెబ్బ కొట్టాడు. దాంతో అక్కడికక్కడే అది ప్రాణం విడిచింది.

ఆ తర్వాత వాడు చీకటి కూపంలోకి వెళ్లి అన్నలని విడిపించాడు. వాళ్లు కొన ఊపిరితో ఉన్నారు. అన్నలనీ, అక్క అల్యోంకానీ, మహాకాళం దాచి పెట్టిన బంగారాన్నీ, వెండినీ తీసుకుని వాడు ఇంటికి బయలు దేరాడు. కాని తమ్ముడినని వాళ్లకి చెప్పలేదు.

వాళ్లు దారిలో ఒక ఓక్ చెట్టు కింద అలసట తీర్చుకుందుకు కూర్చున్నారు. మహాకాళంతో యుద్ధం చేసి చేసి ఉండటం వల్ల దొర్లే బఠానీ గింజకి గాఢ నిద్ర పట్టేసింది. ఆ ఆరుగురు అన్నదమ్ములూ తమలో తాము ఇలా మాట్లాడుకున్నారు.

"ఎవరికైనా ఈ ముక్క తెలిస్తే నవ్వుతారు. మనం ఆరుగురం ఉండీ మహాకాళాన్ని ఏమీ చెయ్యలేకపోయాం. ఈ కుర్రాడు ఒక్కడూ దాన్ని హతమార్చాడు. పైగా దాని ఐశ్వర్యమంతా వీడికే దక్కుతుంది."

దొర్లే బఠానీ గింజ నిద్రపోతూ ఉండగానే ఆ ఓక్ చెట్టుకి కట్టేద్దామని అనుకున్నారు. అలానే కట్టేసి పోతే ఏ అడవి జంతువో వాడిని తినేస్తుందని అనుకున్నారు.

అనుకున్నట్లుగానే కట్టేసి వాడిమానాన వాడిని వదిలేసి వెళ్లిపోయారు.

నిద్రపోతున్నాడు కాబట్టి ఏమీ అనిపించలేదు వాడికి. ఒక పగలూ, ఒక రాత్రీ పడుకున్నాడు. మెలకువ వచ్చి చూసుకుంటే ఒక చెట్టుకి కట్టేసి ఉన్నాడు. కాని అటూ ఇటూ కదిలి హుఫ్ అన్నాడు. చిత్రం! ఓక్ చెట్టు వేళ్లతో సహా పెకలించుకు వచ్చేసింది. వాడు దాన్ని భుజం మీద వేసుకుని ఇంటికి వెళ్లాడు.

ఇంటికి వెళ్లగానే అన్నలు తల్లితో మాట్లాడుతూ ఉండడం వినిపించింది.

"అమ్మా! మేం ఇల్లు వదిలి వెళ్లాక మాకు తోడబుట్టిన వాళ్లెవరైనా ఉన్నారా?" అని అడిగారు.

"ఎందుకు లేరూ! మీకు తమ్ముడు పుట్టాడు. దొర్లే బఠానీ గింజ వాడి పేరు. మిమ్మల్ని వెతుక్కుంటూ బయలుదేరి వెళ్లాడు," అందావిడ.

"అయ్యో! అయితే మనం ఓక్ చెట్టుకి కట్టేసింది వాడినే. వెంటనే వెళ్లి వాడిని విడిపించుకు రావాలి."



కాని దొర్లే బఠానీ గింజ తాను మోసుకు వస్తూ ఉన్న ఓక్ చెట్టుని ఊపాడు. అది ఇంటి కప్పుని గట్టిగా కొట్టుకుంది. ఆ దెబ్బకి ఇల్లు నేల కూలినంత పనైంది.

"ఎక్కడి వాళ్లు అక్కడే ఉండండి. అన్నలారా! నా దారిన నేను పోతా, ఈ విశాల ప్రపంచం అంతా తిరుగుతా," అన్నాడు.

గద భుజం మీద పెట్టుకుని బయలుదేరాడు.

అలా వెళ్లగా వెళ్లగా వాడికి ఎదురుగా రెండు పర్వతాలు కనిపించాయి. ఆ రెండింటి మధ్య ఒక మనిషి నుంచున్నాడు. అతను కాళ్లూ చేతులూ ఆ పర్వతాలకి తన్నిపెట్టి వాటిని దూరం తొయ్యాలని ప్రయత్నిస్తున్నాడు.

"దండాలయ్యా!" అన్నాడు దొర్లె బఠానీ గింజ.

"దండం," అన్నాడతను.

"ఏమిటి చేస్తున్నావు నువ్వు?"

"వస్తూ పోతూ ఉండే దారి కోసమని ఈ కొండల్ని పక్కలకి జరుపుతున్నాను."

"ఎక్కడికి పోతున్నావు నువ్వు?" అని వాడు అడిగాడు.

"లోకం చూసి అదృష్టపరీక్ష చేసుకుందామని."

"నేనూ అందుకే బయలుదేరాను. నీ పేరేమిటి?" అని వాడు అతన్ని అడిగాడు.

"కొండల్నికదిపేవాడు. నీ పేరేమిటి?"

"దొర్లే బఠానీ గింజ. పద కలిసి వెళదాం," అన్నాడు వాడు.

"సరే పద," అన్నాడతను.

ఇద్దరూ కలిసి వెళ్లారు. అలా వెళ్లగా వెళ్లగా వాళ్లకి అడవిలో ఒక మనిషి కనిపించాడు. అతను వేళ్లతో సహా ఓక్ చెట్లని పెకలిస్తున్నాడు. ఒక్కసారి అలా తిప్పుతోంటే చెట్టు వేళ్లతో సహా ఊడివచ్చేస్తోంది.

"దండాలయ్యా," అన్నారు వాళ్లు.

"దండాలు బాబులూ," అన్నాడా మనిషి.

"ఏం చేస్తున్నావేమిటి?"

"ఇటు వచ్చే వాళ్లకి దారి ఉంటుందని ఓక్ చెట్లని పీకేస్తున్నాను."

"ఎక్కడికేమిటి ప్రయాణం?"

"అదృష్ట దేవతని వెతుక్కోడానికి."

"మేమూ అందుకే బయలుదేరాం. నీ పేరేమిటి?"

"ఓక్‌వృక్షమర్దనుడు. తమరి పేర్లేమిటి?"

“దొర్లే బఠానీ గింజ, కొండల్నికదిపేవాడు. కలిసి వెళదాం పద.”

“ఓ, అలాగే.”

వాళ్లు ముగ్గురూ కలిసి వెళ్లారు. అలా వెళ్లగా వెళ్లగా వాళ్లకి నది ఒడ్డున కూచున్న మనిషొకడు కనిపించాడు. ఆ మనిషి మీసాలు చాలా చాలా బారుగా ఉన్నాయి. ఒక్కసారి ఒక మీసం మెలి తిప్పితే చాలు నీళ్లు అటూ ఇటూ వెనక్కి ప్రవహించి నదిలో దారి ఏర్పడుతుంది. అటు వెళ్లాలనుకున్న వాళ్లకి బాట ఏర్పడుతుంది.

“దండాలయ్యా,” అన్నారు వాళ్లు అతన్ని చూసి.

“దండం బాబులూ.”

“ఏమిటి చేస్తున్నావు?”

“నదిని దాటడానికి నీళ్లని అటూ ఇటూ విడదీస్తున్నాను.”

“ఎక్కడికేమిటి ప్రయాణం?”

“అదృష్ట దేవతని వెతకడానికి.”

“మేమూ ఆ పనిలోనే ఉన్నాం. నీ పేరేమిటి?”

“మెలితిప్పేమీసం. మీ పేర్లేమిటో?”

“దొర్లే బఠానీ గింజ, కొండల్నికదిపేవాడు, ఓక్‌వృక్షమర్దనుడు. మనం అదరం కలిసి వెళదాం.”

“కానివ్వండి.”

వాళ్లు అందరూ కలిసి బయలుదేరారు. వాళ్ల ప్రయాణం సునాయాసంగానే ఉంది. ఏమంటే కొండల్నికదిపేవాడు ప్రతి కొండనీ పక్కకి తప్పించేసేవాడు. ఓక్‌వృక్షమర్దనుడు అడ్డం తగిలిన అడవులన్నింటినీ పెకలించేసేవాడు. మెలితిప్పేమీసం దారిలో తగిలిన ప్రతి నది నీటినీ అటూ ఇటూ విడదీసేసేవాడు.

అలా వెళ్లగా వెళ్లగా వాళ్లకి ఓ పెద్ద అడవి మధ్యలో చిన్న గుడిసె కనిపించింది. వాళ్లు లోపలికి అడుగు పెట్టి చూస్తే, చిత్రం! ఎవరూ లోపల ఉంటున్నట్టు కనిపించలేదు.

“రాత్రికి ఇక్కడ కాలక్షేపం చేద్దాం,” అన్నాడు దొర్లే బఠానీ గింజ.

వాళ్లు ఆ రాత్రి ఆ గుడిసెలో గడిపారు. పొద్దున్నే దొర్లే బఠానీ గింజ “కొండల్నికదిపేవాడా, నువ్వు ఇక్కడే ఉండి అన్నం వండు. మేం ముగ్గురం వేటకి వెళ్లి వస్తాం,” అని అన్నాడు.

వాళ్లు వెళ్లిపోయారు. కొండల్నికదిపేవాడు రాశులకొద్దీ అన్నం వండి నిద్రపోయాడు.

అంతలో ఉన్నట్టుండి టకటక తలుపు కొట్టిన చప్పుడైంది.

“తలుపు! తలుపు!” అని ఎవరో అరిచారు.

“నేనేం నీ నౌకరుని కాదు తలుపు తియ్యడానికి,” అన్నాడు కొండల్నికదిపేవాడు.

తలుపు తెరుచుకుంది. అదే గొంతుక మళ్లీ పిలిచింది.

“నన్ను గుమ్మం దాటించు,” అంది.

“నువ్వేం నా యజమానివి కాదు. అందుచేత అరవకు, మూలగకు,” అన్నాడు అతను.

చిత్రం! గుమ్మం ఎక్కి గడప దాటిన ముసలి మనిషి ఎంత చిన్నగా ఉన్నాడో చెప్పలేం. అంత చిన్న మనిషి అసలు ఎన్నడూ ఉండి ఉండడు. ఆ ముసలతని గడ్డం చాలా బారుగా ఉంది. నేలమీద ఈడ్చుకు పడేటంత బారుగా ఉంది. అతను కొండల్నికదిపేవాడి జుట్టు పట్టుకుని గోడమీద మేకుకి వేలాడేశాడు. తర్వాత వండిన అన్నం అంతా తినేసి, తాగాల్సినదంతా తాగేసి వెళ్లిపోయాడు.

కొండల్నికదిపేవాడు మేకునుంచి ఊడి పడేదాకా గుంజుకుని మెలితిరిగాడు. ఊడిపడ్డాక మళ్లీ వంటపని మొదలుపెట్టాడు. వేటకి వెళ్లిన వాళ్లు తిరిగి వచ్చేటప్పటికి ఇంకా వంట పనిలోనే ఉన్నాడు.

“ఏం అన్నం వండడం ఇంత ఆలస్యమైంది?” అని వాళ్లు అడిగారు.

“నిద్రపోయి ఈ విషయమే మరిచిపోయాను,” అన్నాడు అతను.

వాళ్లు కడుపునిండా తిని నిద్రపోయారు. దొర్లే బఠానీ గింజ ఆ మర్నాడు పొద్దుట ఓక్‌వృక్షమర్దనుడికి చెప్పాడు:

“నువ్వు ఇంటిదగ్గర ఉండు. మేం వేటకి వెళ్లి వస్తాం.”

వాళ్లు వెళ్లిపోయారు. ఓక్‌వృక్షమర్దనుడు బళ్లకొద్దీ అన్నం వండాడు.

అంతలో టకటక తలుపు కొట్టిన చప్పుడైంది.

“తలుపు! తలుపు,” అని పిలుపు వినిపించింది.

“నేనేం నీ నౌకరుని కాను, తలుపు తియ్యడానికి,” అని ఓక్‌వృక్షమర్దనుడు జవాబు చెప్పాడు.

“నన్ను గుమ్మం దాటించు,” అని అదే గొంతుక మళ్లీ పిలిచింది.

“నువ్వేం నాకు యజమానివా? అందుచేత అరవొద్దు, మూలగొద్దు,” అని ఓక్‌వృక్షమర్దనుడు జవాబు చెప్పాడు.

చిత్రం! గుమ్మం ఎక్కి గడప దాటిన ముసలి మనిషి ఎంత చిన్నగా ఉన్నాడో చెప్పలేం. అతని గడ్డం చాలా బారుగా ఉంది. నేలమీద ఈడ్చుకు పడేటంత బారుగా ఉంది. ఆ ముసలతను ఓక్‌వృక్షమర్దనుడిని జుట్టు పట్టుకుని గోడమీద ఓ మేకుకి వేలాడేశాడు. తర్వాత వండిన అన్నం అంతా తినేసి, తాగవలసిందంతా తాగేసి వెళ్లిపోయాడు.

ఓక్‌వృక్షమర్దనుడు మేకునుంచి ఊడి పడేదాకా గుంజుకుని మెలి తిరిగాడు. ఊడిపడ్డాక మళ్లీ వంటపనికి దిగాడు. వేటకి వెళ్లిన వాళ్లు తిరిగి వచ్చేటప్పటికి ఇంకా వంటపనిలోనే ఉన్నాడు.

"ఏం ఇంత ఆలస్యమైంది?" అని వాళ్లు అడిగారు.

"నిద్రపోయా, కొంచెం సేపటి క్రితమే లేచా," అని అతను జవాబు చెప్పాడు.

ఏం జరిగిందో కొండల్నికదిపేవాడు ఊహించి నోరు మెదపకుండా ఊరుకున్నాడు.

మూడవ రోజున మెలితిప్పేమీసం ఇంటి దగ్గర ఉండిపోయాడు. అతనికీ అంతే జరిగింది.

"మీరు ముగ్గురూ ముగ్గురే! వంట ఆలస్యం చేస్తున్నారు. రేపు మీరు వేటకి వెళ్లండి. నేను ఇంటి దగ్గర ఉండి పోతాను," అని దొర్లే బఠానీ గింజ అన్నాడు.

తెల్లవారింది. దొర్లే బఠానీ గింజ ఇంటి దగ్గర ఉండిపోయాడు, మిగిలిన ముగ్గురూ వేటకి వెళ్లారు. వాడు రాశులకొద్దీ అన్నం వండి ఓ కునుకు తీద్దామా అనుకుంటున్నాడు. ఇంతలోనే తలుపు టకటక చప్పుడైంది.

"తలుపు! తలుపు!" అని ఎవరో పిలిచారు. దొర్లే బఠానీ గింజ తలుపు తీశాడు. అతని ముందు అతి చిన్న ముసలతను నుంచుని ఉన్నాడు. అతని గడ్డం బారుగా ఉంది. అది నేలమీద ఈడ్చుకుంటూ పడేటంత బారుగా ఉంది.

"నన్ను గడప దాటించు, బాబూ!" అన్నాడా ముసలాడు.

దొర్లే బఠానీ గింజ ఆ ముసలతన్ని ఎత్తి, ఇంట్లోకి తీసుకువచ్చి నేలమీద కూర్చోపెట్టాడు. ఆ చిన్న ముసలతను గుండ్రంగా తిరుగుతూ, చిన్నగా గెంతుతూ కయ్యానికి కాలు దువ్వడం మొదలుపెట్టాడు.

"ఏం కావాలి నీకు?" అని దొర్లే బఠానీ గింజ అడిగాడు.

"ఏం కావాలో ఇప్పుడే చూద్దువుగాని," అన్నాడు ముసలతను. తన చేతిని చాచి దొర్లే బఠానీ గింజ జుట్టు అంది పుచ్చుకోబోయాడు. కాని వాడు "ఓహో! నువ్విలాంటి మనిషివన్న మాట," అని తన జుట్టు అందించడానికి బదులుగా ఆ ముసలతని గడ్డం పట్టుకున్నాడు. ఒక గొడ్డలి తీసుకుని, ఈ చిన్న ముసలతన్ని బయటికి ఓక్ చెట్టుదాకా ఈడ్చుకుపోయాడు. ఆ చెట్టుని రెండుగా చీల్చి ముసలతని గడ్డం ఆ గాడిలో పెట్టి చెట్టుని అతికేశాడు.

"నా జుట్టు పట్టుకుందామన్న దురాలోచన చేశావ్, తాతా? అందుకే నేను తిరిగొచ్చేదాకా ఇక్కడే ఉండు," అన్నాడు.

ఇంటికి తిరిగి వెళ్లేప్పటికి ముగ్గురు నేస్తాలూ తన కోసం చూస్తూ ఉన్నారు.

"వంటయిందా?" అని వాళ్లడిగారు.

"ఆ, అయింది. నేను మీ కోసం కనిపెట్టుకుని కూచున్నాను," అన్నాడు వాడు.

వాళ్లు భోజనాలకి కూర్చుని తినడం మొదలు పెట్టారు. భోజనాలయ్యాయి.

"నాతో రండి! ఒక వింత దృశ్యం చూపిస్తాను," అని అన్నాడు వాడు.

వాళ్లని బయటికి తీసికెళ్లాడు. ఏం మాయో! ఓక్‌చెట్టూ లేదు, చిన్న మొసలతనూ లేడు. ఆ చిన్న మొసలాడు ఓక్‌చెట్టుని వేళ్లతో సహా పెకలించేసి తనతోపాటు ఈడ్చుకుపోయాడు.

దొర్లే బఠానీ గింజ జరిగిన కథంతా తన మిత్రులకి చెప్పాడు. వాళ్లు కూడా ఆ మొసలతను తమని మేకుకి వేలాడేసిన విషయం చెప్పారు.

"వాడు దుర్మార్గపు మొసలాడు. వెళ్లి వెతుకుదాం పదండి," అన్నాడు దొర్లే బఠానీ గింజ.

ఆ చిన్న మొసలతను ఓక్‌చెట్టుని ఈడ్చుకుపోతూ ఉండడంతో నేలమీద జాడ పడింది. దాంతో ఈ మిత్రులకి అతన్ని వెంబడించడం తేలికయ్యింది.

ఆ జాడని బట్టి వెళ్లగా వాళ్లకి ఒక బిలం తగిలింది. అది చాలా లోతుగా, అసలు మట్టు ఉందా లేదా అనిపించేట్టు ఉంది.

దొర్లే బఠానీ గింజ అప్పుడు కొండల్నికదిపేవాడికేసి తిరిగాడు.

"బిలంలోకి దిగు," అని అతనితో చెప్పాడు.

"నేనా! చాల్లే," అన్నాడు కొండల్ని కదిపేవాడు.

"ఓక్‌వృక్షమర్దనుడా నువ్వు? లేదా నువ్వు, మెలితిప్పేమీసం?" అని వాళ్లని అడిగాడు.

బిలంలోకి దిగే సాహసం ఆ ఇద్దర్లో ఎవరికీ లేకపోయింది.

"సరే అయితే! నేనే దిగుతాను. కాని నాకు ఒక తాడు కావాలి. ఒక తాడుని పేనుదాం పట్టండి," అన్నాడు బఠానీ గింజ.

వాళ్లు తాడుని పేనారు. దొర్లే బఠానీ గింజ ఆ తాడుకి ఒక చివర పట్టుకుని మణికట్టు చుట్టూ కట్టుకున్నాడు.

"ఇప్పుడు దిగుతాను," అన్నాడు.

వాళ్లు దొర్లే బఠానీ గింజని దింపుతూనే ఉన్నారు. వాళ్లకి అలా దింపడం చాలాసేపు పట్టింది. ఆ బిలం పాతాళలోకమంత లోతు ఉంది. మొత్తంమీద ఆఖరికి వాడిని కిందికంటా దింపారు.

దొర్లే బఠానీ గింజ ఆ జాగాని వెతకడం మొదలుపెట్టాడు. వాడు అలా నడుచుకుంటూ వెళుతూ ఉండగా ఒక పెద్ద భవనం కనిపించింది. వాడు దాని లోపలికి వెళ్లాడు. ఆ భవనం లోపల అంతా ధగధగా మెరుస్తోంది. ఏమంటే లోపల అంతా విలువైన వజ్రాలు పొదిగి బంగారంతో చేసి ఉంది. వాడు ఒక గదిలోంచి ఇంకో గదిలోకి వెళుతూనే ఉన్నాడు. ఇంతలో ఉన్నట్టుండి అతనికేసి ఒక రాకుమారి పరిగెత్తుకుంటూ వచ్చింది. ఆమె అద్భుత సౌందర్య రాశి. అసలు ఆమెతో పోల్చడానికి పద్నాలుగు లోకాల్లో ఎవరూ లేరు.

“ఇలా వచ్చావేం యువకుడా?” అందామె.

“నేలమీద జీరాడే గడ్డం ఉన్న ముసలతని కోసం వెతుకుతున్నాను,” అన్నాడు వాడు.

“అతని గడ్డం ఓక్‌చెట్టు బీటలో చిక్కుకుంది. దాన్ని లాక్కోవడం కోసం తంటాలు పడుతున్నాడు,” అని రాకుమారి చెప్పింది. “అతని దగ్గరికెళ్లొద్దు. ఏమంటే మిగతా వాళ్లలాగే నిన్నూ చంపేస్తాడు,” అంది.

“నన్ను చంపడు. అతని గడ్డం పట్టుకుని ఆ బీటలో పెట్టి నొక్కేసిన వాడిని నేనే. ఇంతకీ నువ్వెవరు?” అని వాడు ఆమెని అడిగాడు.

“నేను రాకుమారిని. ఈ చిన్న ముసలాడు నన్నెత్తుకొచ్చి ఇక్కడ బందీగా ఉంచాడు,” అని చెప్పిందామె.

“నిన్ను విడిపిస్తాను, భయపడకు. నన్ను అతని దగ్గరికి తీసికెళ్లు.”

రాకుమారి అతడిని ఆ చిన్న ముసలతని దగ్గరికి తీసుకువెళ్లింది. తీరాచూస్తే ఆ ముసలతను చెట్టు బీటలోనుంచి గడ్డం ఇవతలికి లాక్కుని నిమురుకుంటున్నాడు. దొర్లే బతానీ గింజని చూడగానే అతని ముఖం కోపంతో జేవురించింది.

“ఇలా వచ్చావు ఏంటి? నాతో యుద్ధం చేయడానికి వచ్చావా? సంధి కుదుర్చుకుందామని వచ్చావా?” అని అడిగాడు.

“నేనిక్కడికి వచ్చింది నీతో యుద్ధం చెయ్యడానికి. నీలాంటి వాళ్లతో సంధి చేసుకుంటాను అనుకుంటున్నావా?” అని దొర్లే బతానీ గింజ అన్నాడు.

ఇద్దరూ యుద్ధం చెయ్యడం మొదలుపెట్టారు. భీకరంగా పోరాడారు. చాలాసేపు పోరాడారు. ఆఖరికి దొర్లే బతానీ గింజ తన గదతో ముసలతన్ని కొట్టి చంపేశాడు.

ఆ తర్వాత వాడూ, ఆ రాకుమారీ ఆ భవనంలో దొరికిన బంగారాన్నీ, వజ్రాలనీ పోగు చేసుకుని మూడు బస్తాలనిండా నింపారు. ఆ పాతాళ లోకంలోకి తాడు పట్టుకు దిగిన బిలం దగ్గరికి బయలుదేరారు.

కొంచెం సేపట్లోనే అక్కడికి చేరారు. వాడు నోటి దగ్గరగా చేతుల్ని పెట్టి మిత్రుల్ని పిలిచాడు.

“ఇంకా అక్కడ ఉన్నార్రా?” అని అడిగాడు.

“ఉన్నాం,” అని జవాబు వచ్చింది.

వాడు ఒక బస్తాని తాడుకి కట్టాడు.

“పైకి లాగండ్రా! ఈ బస్తా మీదే!” అన్నాడు.

వాళ్లు బస్తాని పైకి లాగి మళ్లీ తాడుని లోపలికి దింపారు. వాడు మళ్లీ ఇంకో బస్తాని కట్టాడు.

"దీన్ని లాగండి! ఇది మీదే," అని చెప్పాడు.

అలాగే మూడో బస్తానీ కట్టాడు. ఆ తర్వాత రాకుమారిని తాడుకి కట్టాడు.

"రాకుమారి నాది," అన్నాడు.

ఆ ముగ్గురు మిత్రులూ రాకుమారిని పైకి తీశారు. ఇప్పుడు లోపల వాడొక్కడూ మిగిలిపోయాడు.

"వాడిని పైకి లాగి తాడుని వదిలేద్దాం. వాడు కింద పడి చస్తాడు. రాకుమారి మనకి దక్కుతుంది."

కాని వాడు వాళ్లేం చెయ్యబోతారో ఊహించాడు. అందుకని ఒక పెద్ద బండరాతిని తాడుకి కట్టాడు.

"ఇప్పుడు లాగండి నన్ను పైకి," అని అరిచాడు.

వాళ్లు తాడుని దాదాపు బిలం అంచుదాకా లాగి వదిలేశారు. ఆ రాయి జర్రున కిందకి పడింది. ధనామని చప్పుడైంది.

"భలేవాళ్లున్నారు నాకు స్నేహితులు," అనుకున్నాడు అతడు. అక్కడినుంచి ఆ అధోలోకంలో తిరగడం మొదలుపెట్టాడు.

అలా నడుస్తూనే ఉన్నాడు. ఉన్నట్టుండి ఆకాశంలో మేఘాలు కమ్ముకున్నాయి. వడగళ్ల వాన మొదలైంది. వాడు ఒక ఓక్‌చెట్టు కిందకి చేరాడు. అక్కడ నుంచుని ఉండగా వాడికి చెట్టు పైన ఉన్న గూటినుంచి రాబందు పిల్లలు కిచకిచలాడుతూ ఉండడం వినిపించింది. వాడు చెట్టెక్కి తన కోటువిప్పి వాటికి కప్పాడు.

వాన వెలిసింది. పెద్ద రాబందు ఎగురుకుంటూ వచ్చింది. అది ఈ బుల్లి రాబందుల తండ్రి.

"ఎవరమ్మా మీకు ఇలా కప్పింది?" అని అడిగింది.

"నువ్వు అతన్ని మింగెయ్యనంటే చెబుతాం," అన్నాయి అవి.

"ఎందుకు తింటాను? భయం లేదు, చెప్పండి."

"చెట్టు కింద కూర్చున్న అతన్ని చూశావా? అతనే మాకిలా కప్పాడు."

పెద్ద రాబందు కిందికి వెళ్లింది.

"ఏమన్నా కోరుకో, నీ కోరిక తీరుస్తాను," అంది అది. "నేను లేనప్పుడు వడగళ్ల వానకి బలై పోకుండా నా బిడ్డలు దక్కడం ఇదే మొదటిసారి," అంది అది.

"నన్ను మా రాజ్యానికి తీసికెళ్లు," అని అడిగాడు.

"అది మాటలతో జరిగే పని కాదు. కాని ఆరు సీసాల మాంసం, ఆరు పీపాల నీళ్లు కూడా ఉంటే సాధించగలం," అంది పెద్ద రాబందు. "నేను కుడిపక్కకి తల తిప్పినప్పుడల్లా నువ్వు ఒక మాంసం ముక్క నానోట్లో వెయ్యాలి. ఎడమవేపు తల తిప్పినప్పుడల్లా ఒక గుక్క నీళ్లు పొయ్యాలి.

అలా చెయ్యకపోతే నేను ఎన్నటికీ చేరుకోలేను. దారిలోనే చచ్చిపోతాను," అంది.

ఆరు పీపాల మాంసం, ఆరు పీపాల నీళ్లు తీసుకుని ప్రయాణం మొదలుపెట్టారు. దొర్లే బఠానీ గింజ వాటిని రాబందు వీపుమీద పెట్టి, తనూ ఎక్కాడు. అది ఎగిరింది. రాబందు తలని కుడివేపు తిప్పినప్పుడల్లా వాడు కొంత మాంసం దాని నోట్లో వేసేవాడు. అది తలని ఎడమవేపు తిప్పినప్పుడల్లా ఒక గుక్క నీళ్లు పోసేవాడు.

ఆ విధంగా ఎన్నో రోజులు ప్రయాణం సాగింది. దొర్లే బఠానీ గింజ దాదాపు రాజ్యానికి చేరుకున్నట్టే, అప్పుడు రాబందు తల కుడివేపు తిప్పింది. వాడు ఆఖరి పీపాలోకి చూశాడు. అక్కడ ఒక్క పిసరు కూడా మాంసం మిగల్లేదు. అదిచూసి తన కాలునుండి ఒక ముక్కకోసి దానికి పెట్టాడు. వాళ్లు గమ్యం చేరారు. అప్పుడు "నేనిప్పుడు తిన్నది ఏమిటి? చాలా బాగుంది," అని రాబందు అడిగింది.

"నా శరీరంలోని మాంసం," అన్నాడు వాడు కాలు చూపించి.

రాబందు ఏమీ అనలేదు. కాని ఆ ముక్కని ఊసింది. వాడిని అక్కడే ఉంచి కొంచెం ఆరోగ్యజలం తేవడానికి వెళ్లింది. కొంచెం సేపట్లోనే నీళ్లతో వచ్చింది. వాడు కాలులో కోసినముక్కని అతికించి నీళ్లు పొయ్యగానే అది వెంటనే బాగయిపోయింది.

ఆ తర్వాత రాబందు తన ఇంటికి ఎగిరి వెళ్లిపోయింది. నమ్మకద్రోహం చేసిన ఆ మిత్రులు ఎక్కడున్నారా అని వెతకడానికి వెళ్లాడు దొర్లే బఠానీ గింజ.

ముగ్గురూ ఆ రాకుమారిని తీసుకొని రాచప్రాసాదానికి వెళ్లారు. అక్కడ రాకుమారిని ఎవరు పెళ్లి చేసుకోవాలా అని వాళ్లల్లో వాళ్లు దెబ్బలాడుకోవడం మొదలుపెట్టారు.

దొర్లే బఠానీ గింజ వాళ్లని అక్కడ పట్టుకున్నాడు. అతడిని చూడగానే వాళ్ల ముఖాల్లో కత్తివేటుకి నెత్తుటి చుక్క లేకపోయింది.

"నా అన్నలే నాకు అన్యాయం చేశారు. మీదేముంది! మిమ్మల్ని క్షమించక తప్పదు," అన్నాడు.

తర్వాత వాడు రాకుమారిని పెళ్లాడాడు. ఇద్దరూ హాయిగా కలకాలం బతికారు.





# మహిమ ఉన్న గుడ్డు

ఒకప్పుడు భరద్వాజ పిట్ట రాజుగా ఉండేది. ఎలుక మంత్రిగా ఉండేది. వాటికి సొంత పొలం ఉండేది. ఆ పొలంలో అవి గోధుమ గింజలు చల్లాయి. పంట పక్వానికి రాగానే అవి కోసుకుని సమంగా పంచుకోవడం మొదలుపెట్టాయి. అంతా అయ్యాక ఒక చిన్న గింజ మిగిలిపోయింది.

“నన్ను తీసుకోనీ,” అంది ఎలుక.

“ఉహూఁ, నన్ను తీసుకోనీ,” అంది భరద్వాజ పిట్ట.

“అయితే ఒక పని చేద్దాం. దీన్ని రెండుగా కొరుకుతాను, ఇద్దరికీ చెరిసగం ఉంటుంది,” అంది ఎలుక.

భరద్వాజ పిట్ట సరేనని ఒప్పుకుంది. కాని గింజని పళ్ల కింద పెట్టీ పెట్టుకోగానే ఎలుక తన కలుగులోకి పారిపోయింది.

భరద్వాజ పిట్టకి చాలా కోపం వచ్చింది. అది పక్షులన్నిటినీ పిలిచి ఎలుకమీద దండయాత్ర చేసింది. కాని ఎలుక తక్కువ తిందా? అది తన తోటి జంతువులనన్నింటినీ కూడగట్టుకుని సైన్యం తయారు చేసుకుంది. ఆ రెండు సైన్యాలూ ఒక అడవిలో తలపడ్డాయి. కనీ వినీ ఎరగనంతటి ఘోర యుద్ధం జరిగింది.

పోరు పగలంతా సాగేది. సాయంత్రం రెండు పక్షాలూ విశ్రాంతి తీసుకోటానికి యుద్ధం ఆపేసేవి. అప్పుడు ఎలుక తన సైన్యాన్ని తనిఖీ చేసింది. తన సైన్యంలో చీమలు లేవు. వెంటనే సైన్యంలో చేరమని చీమలకి ఆజ్ఞ ఇచ్చింది. చీమలు పరిగెత్తుకుంటూ వచ్చాయి. రాత్రి చీకట్లో గుట్టు చప్పుడు కాకుండా చెట్లు ఎక్కమనీ, పక్షుల రెక్కల ఈకలు కొరికెయ్యమనీ అది చీమలకి ఆజ్ఞ జారీ చేసింది.

పొద్దున్నే భరద్వాజ పిట్ట లేచి "లేవండి, యుద్ధానికి వేళ అయింది," అని అరిచింది.

అప్పుడు పక్షులన్నీ లేచాయి. చూస్తే రెక్కలకి ఈకలు లేవు. దాంతో ఎగరలేకపోయాయి. అవి నేలమీద కూలిపోయాయి. వాటిమీదకి జంతువులు ఉరికి చంపేశాయి. యుద్ధంలో ఎలుక గెలిచింది.

పక్షుల్లో ఒక డేగ ఉంది. రెక్కలకి ఈకలు లేకుండా ఎగరడం ఎంత కష్టమో అది చూసింది. అందుకని ఎగరాలని ప్రయత్నించకుండా చెట్టుమీదనే ఉండిపోయింది. దాన్ని ఒక వేటగాడు చూశాడు. తుపాకీ ఎత్తి దానికి గురిపెట్టాడు. కానీ "నన్ను చంపద్దు వేటగాడా! నీకేమన్నా కష్టాలు వస్తే నీకు సాయం చేస్తాను," అని డేగ చెప్పింది.

ఆ మాటలు విని వేటగాడు ఒక క్షణం ఆగాడు. కాని మళ్లీ జాగ్రత్తగా గురిచూసి పేల్చబోయాడు. చంపవద్దని డేగ మళ్లీ బతిమలాడింది.

"నన్ను తీసికెళ్లి పెంచుకో, నీకు లాభం ఉంటుంది వేటగాడా," అంది.

అయినా వేటగాడు ఆగలేదు. మళ్లీ గురిపెట్టి కాల్చబోయాడు.

"నన్ను చంపద్దు, వేటగాడా! నన్ను తీసికెళ్లు. నీకెంత సేవ చేస్తానో నువ్వే చూద్దువుగాని," అంది డేగ.

డేగ మాటలు నమ్మాడు వేటగాడు. సరేనని చెట్టు ఎక్కి డేగని దింపాడు.

"నన్ను ఇంటికి తీసికెళ్లు వేటగాడా. నా రెక్కలు పెరిగేదాకా మాంసం మాత్రమే నాకు తినబెట్టు," అంది డేగ.

ఆ వేటగాడికి రెండు ఆవులూ, ఒక ఎద్దూ ఉన్నాయి. అతను డేగకి పెట్టేందుకు ఒక ఆవుని చంపాడు. ఆ మాంసం డేగకి ఒక ఏడాది సరిపోయింది. మాంసం అంతా తినేశాక డేగ వేటగాడితో ఒకరోజు అంది: "నన్ను ఒదిలి ఉదయమంతా కొంచెం ఇటూ అటూ ఎగరనీ, నా రెక్కలు సరిపడా పెరిగాయో లేదో చూసుకుంటాను."

ఆ వేటగాడు దాన్ని వదిలాడు. డేగ పొద్దుటిపూట అంతా ఎగరడం అభ్యాసం చేసింది. మిట్ట మధ్యాహ్నం వేళకి వేటగాడి దగ్గరికి తిరిగి వచ్చింది.

"నాకు ఇంకా నీరసం తగ్గలేదు. నీ రెండో ఆవుని కూడా చంపేసి పెట్టు," అంది డేగ.

వేటగాడు రెండో ఆవుని చంపాడు. డేగ ఆ మాంసాన్ని మరో ఏడాది పాటు తింది. మళ్లీ ఎగరబోయింది. రోజంతా ఎగురుతూనే ఉంది. సాయంత్రం అవుతూ ఉండగా తిరిగి వేటగాడి దగ్గరికి వచ్చి "నాకింకా సరిగ్గా బలం రాలేదు. నీ ఎద్దుని చంపి పెట్టు," అంది డేగ.

వేటగాడు సందిగ్ధంలో పడ్డాడు. 'డేగ అడిగినట్టు చెయ్యనా వద్దా?' అని ఆలోచించాడు.

'సరే, రెండు ఆవుల్ని ఎలాగూ పెట్టాను, ఎద్దుని కూడా పెట్టేస్తే పోతుంది,' అని అనుకున్నాడు.

అతను ఎద్దుని చంపి డేగకి పెట్టాడు. డేగ దాన్ని ఏడాది అంతా తిన్నది. వెంటనే ఆకాశంలోకి

మేఘాల్లోకంటా ఎగిరిపోయింది. చాలా సేపు గిరికీలు కొడుతూ ఎగిరింది. ఆఖరికి వేటగాడి దగ్గరికి దిగి వచ్చింది.

"నీ మేలు మరవను వేటగాడా! నాకు బాగా తిండి పెట్టావు. నేను మళ్లీ బలం పుంజుకునేట్టు చేశావు. రా, నా వీపుమీదకి ఎక్కు," అంది.

"వీపుమీదకి ఎక్కడం ఎందుకు?" అని వేటగాడు అడిగాడు.

"ఎక్కి చూడు నీకే తెలుస్తుంది," అంది డేగ.

వేటగాడు దాని వీపుమీదకి ఎక్కాడు. డేగ అతన్ని సరాసరి మేఘాల్లోకి తీసుకుపోయి, కిందికి తోసేసింది. వేటగాడు కొంచెంలో నేలమీద పడిపోతాడనగా డేగ సర్రని వచ్చి పట్టుకుంది.

"ఊఁ, ఎలా ఉంది?" అని అడిగింది.

"చచ్చాననుకున్నాను," అని వేటగాడు చెప్పాడు.

"నువ్వు మొదటిసారి నన్ను కాల్చబోయినప్పుడు నాకూ అలానే అనిపించింది. రా, మళ్లీ నా వీపుమీదకి ఎక్కు," అంది.

వేటగాడికి అలా ఎక్కాలన్న ఆత్రం ఏమీ లేకపోయింది. కాని గత్యంతరమూ లేకపోయింది. అందుకని మళ్లీ డేగ వీపుమీదకి ఎక్కాడు. డేగ అతన్ని దట్టమైన మేఘాల్లోకంటా తీసుకుపోయి, ముందటిలాగానే జారవిడిచింది. వేటగాడు నేలకి ఇంకో పదడుగుల దూరంలో ఉండగానే మళ్లీ పట్టుకుంది.

"ఊఁ, ఎలా ఉంది?" అని అడిగింది.

"ఎలా ఉండడమేమిటి! ఎముకలన్నీ పొడుం అయిపోయాయి అనుకున్నాను," అన్నాడు వేటగాడు.

"నువ్వు రెండోసారి నన్ను కాల్చబోయినప్పుడు నాకూ అలాగే అనిపించింది. ఊఁ, రా, మళ్లీ నా వీపుమీదకి ఎక్కు," అంది.

వేటగాడు దాని వీపుమీదకి ఎక్కాడు. డేగ అతన్ని ఇంకా ఎత్తుకి తీసుకుపోయి కిందకి తోసేసింది. ఇంకొంచెం ఉంటే నేలకి ఢీ కొట్టుకునేవాడే. అంతలో అతన్ని మళ్లీ పట్టుకుంది.

"ఊఁ, ఎలా ఉంది?" అని అడిగింది.

"అసలు నేను బతికి ఉన్నానా అనిపించింది," అన్నాడు వేటగాడు.

"నువ్వు మూడోసారి నన్ను కాల్చబోయినప్పుడు నాకూ అలానే అనిపించింది," అంది డేగ. "సరే ఇప్పుడంతా చెల్లయిపోయింది. రా, నా వీపుమీదకి ఎక్కు. మా ఇంటికి తీసికెళతాను," అంది.

ఎగిరి వెళ్లి డేగ పినతండ్రి ఇంటి దగ్గర ఆగింది.

"ఇంట్లోకి వెళ్లు, నన్ను చూశావా అని వాళ్లు అడిగితే 'నాకు మహిమ ఉన్న గుడ్డుని ఇస్తే డేగని తీసుకువస్తాను,' అని చెప్పు," అంది.

వేటగాడు ఇంట్లోకి వెళ్లాడు. తనంతట తనే వచ్చాడా? లేదా? అని అతన్ని ఇంట్లో ఉన్న దేగలు అడిగాయి.

"అసలైన యోధుడు ఎక్కడికైనా తన ఇష్టపూర్తిగా తప్ప వెళ్లడు," అని వేటగాడు చెప్పాడు.

"మా అన్నయ్యగారి అబ్బాయి ఎక్కడ ఉన్నాడో తెలుసా?" అని ఆ దేగలు అడిగాయి. "యుద్ధానికి వెళ్లి మూడేళ్లు అయ్యింది. ఇంతవరకూ వాడి కబురు ఏమీ తెలీలేదు," అన్నాయవి.

"నాకు మహిమ ఉన్న గుడ్డుని ఇస్తే తీసుకువస్తాను," వేటగాడు అన్నాడు.

"ఉహుం, ఇవ్వలేం. పోస్లే వాడిని చూడకపోతే."

వేటగాడు ఒట్టి చేతులతో దేగ దగ్గరికి వెళ్లి జరిగిన సంగతి చెప్పాడు.

"సరే పద పోదాం," అంది దేగ.

దేగ తన అన్నగారి ఇంటికి ఎగురుకుంటూ వెళ్లి అక్కడ ఆగింది. వేటగాడు దేగ పినతండ్రితోనూ, పినతల్లితోనూ అన్న మాటలనే ఇక్కడా వల్లించాడు. కానీ దేగ అన్న కూడా అతనికి మహిమ ఉన్న గుడ్డుని ఇవ్వలేదు.

తర్వాత దేగ తండ్రిగారింటికి ఎగిరి వెళ్లింది. "లోపలికి వెళ్లు, నా గురించి అడిగినప్పుడు నన్ను చూశాననీ, మహిమ ఉన్న గుడ్డుని ఇస్తే వాళ్ల దగ్గరికి తీసుకువస్తాననీ చెప్పు," అని వేటగాడితో చెప్పింది.

వేటగాడు ఇంట్లోకి వెళ్లాడు. తనంతట తనే వచ్చాడా లేదా అనే ఆ దేగలు ముందుగా అతన్ని అడిగాయి.

"అసలైన యోధుడు ఎక్కడికైనా తన ఇష్టపూర్తిగా తప్ప వెళ్లడు," అని వేటగాడు జవాబు చెప్పాడు.

"మా అబ్బాయి కనిపించాడా? మూడేళ్లయింది యుద్ధానికి వెళ్లి, బతికే ఉన్నాడో లేదో కూడా మాకు తెలియదు."

"మీ అబ్బాయిని చూశాను. నాకు మహిమ ఉన్న గుడ్డుని ఇస్తే మీ అబ్బాయిని మీ దగ్గరికి తీసుకువస్తాను," అని వేటగాడు చెప్పాడు.

"నీకు మహిమ ఉన్న గుడ్డు ఎందుకు? దాని బదులుగా బస్తాలకొద్దీ బంగారం ఇస్తాం," అని దేగ తండ్రి అన్నాడు.

"దానికి బదులుగా నాకేం అక్కర్లేదు. మహిమ ఉన్న గుడ్డు తప్ప నాకేం అక్కర్లేదు," అన్నాడు వేటగాడు.

"సరే అయితే, మా అబ్బాయిని తీసుకురా. నీకు దాన్ని ఇస్తాం," అని దేగ తండ్రి అన్నాడు.

వేటగాడు దేగని తీసికెళ్లాడు. దేగ తల్లికీ, తండ్రికీ కలిగిన సంతోషం ఇంతా అంతా కాదు. దాంతో వేటగాడికి మహిమ ఉన్న గుడ్డు వచ్చింది.

"ఇంటికి వెళ్లేదాకా దాన్ని బద్దలు కొట్టద్దు. జాగ్రత్త, మొదట దాని చుట్టూతా ఎత్తైన కంచె కట్టు," అని ఆ డేగలు హెచ్చరించాయి.

వేటగాడు వెనక్కి బయలుదేరాడు. నడిచీ, నడిచీ అతనికి బాగా దాహం వేసింది. అతను ఒక నూతి దగ్గరికి వెళ్లాడు. నీళ్లు తాగుదామని బాల్చీమీదకి వంగి చూసుకోకుండా గుడ్డుని ఒక పక్క పడదోసుకున్నాడు. అది పగిలిపోయింది.

గుడ్డు లోపలనుంచి వచ్చాయి చూడండి బాబూ! ఆవులు! ఒకటే మందగా వచ్చాయి. వాటిని ఎలా ఆపాలో తెలియక వేటగాడికి మతిపోయింది. "హేయ్! హేయ్!" అని గట్టిగా అరుస్తూ కాసేపు ఒక పక్కకి, కాసేపు ఇంకో పక్కకి పరిగెట్టాడు కాని ఏం చెయ్యలేకపోయాడు.

ఇంతలో ఒక పాము అతని దగ్గరికి పాక్కుంటూ వచ్చింది.

"ఈ ఆవుల్ని మళ్లీ గుడ్డు లోపలికి పంపేస్తాను, నాకేం ఇస్తావయ్యా?" అని పాము మనిషి భాషలో అడిగింది.

"ఏం కావాలి నీకు?" అని వేటగాడు అడిగాడు.

"నువ్వు లేనప్పుడు మీ ఇంట్లో ప్రత్యక్షమైన దాన్ని ఇస్తావా?"

"అలాగే."

ఆ పాము ఆవులను అన్నింటినీ గుడ్డు లోపలికి గెంటేసి, పగిలిన పెంకుని అతికించేసి ఆ గుడ్డుని మళ్లీ వేటగాడికి ఇచ్చేసింది.

వేటగాడు ఇంటికి చేరుకున్నాడు. తను లేనప్పుడు తనకి కొడుకు పుట్టాడు అని వినగానే కొంపలంటుకుపోయాయని తల చేత్తో పట్టుకున్నాడు.

"ఓరి, నాయనా! నిన్నురా, పాముకి ఇచ్చేస్తానని మాట ఇచ్చాను!" అని రోదించాడు.

వేటగాడూ, అతని పెళ్లాం చాలా విచారించారు.

"చేసేదేమీ లేదు, బాధపడి సాధించేదీ ఏం లేదు," అనుకున్నారు.

అందుకే వాళ్లు ఇంటి చుట్టూతా కంచె కట్టారు. తర్వాత గుడ్డుని పగలగొట్టారు. ఆవులు బయటికి వచ్చాయి. ఆ మంద ఎంతో పెద్దది. వాళ్లు ఎంతో భాగ్యవంతులు అయ్యారు.

ఏళ్లు గడిచాయి. వాళ్ల కొడుకూ పెద్దవాడయ్యాడు.

"పాముకి నన్ను ఇస్తానని మాట ఇచ్చారు. మరి మాట నిలుపుకోవాలి నాన్నా," అన్నాడు.

అలా అని పాము దగ్గరికి వెళ్లిపోయాడు.

"నీకు మూడు పరీక్షలు పెడతాను. నువ్వు నెగ్గుకొస్తే ఇంటికి వెళ్లిపోవచ్చు. లేకపోతే నిన్ను తినేస్తాను," అంది పాము.

పాము ఇంటి చుట్టూతా దట్టంగా, అడవిలా పెరిగిపోయిన పెద్ద మడి ఉంది. అది చూపు ఆనినంత మేర విస్తరించి ఉంది.



"ఈ మడి చూశావా? నువ్వు ఇక్కడి చెట్లన్నీ కొట్టి, దున్ని, గోధుమ విత్తనాలు చల్లి, పంట కోసి, పోగు చేసి బస్తాల్లో పోసి తీసుకురావాలి. ఈ పనంతా ఒక్క రాత్రిలో అయిపోవాలి. తినటానికి ఆ గోధుమల పిండితో రొట్టె చేసి, దాన్ని కాల్చి నేను పొద్దున్న లేచి బల్ల దగ్గరికి వచ్చేసరికి సిద్ధంగా ఉంచాలి," అంది.

వేటగాడి కొడుకు తల వేలాడేసుకుని దిగాలుగా వెళ్లిపోయాడు. ఒక దారివెంట నడుస్తూ ఉన్నాడు. ఆ దార్లోనే ఒక రాతి స్తంభం ఉంది. ఆ స్తంభంలో ఈ పాము కూతురు బందీగా ఉంది.

వేటగాడి కొడుకు ఆ స్తంభం దగ్గర నుంచుని ఏడ్చాడు. ఆ కన్య అతని ఏడుపు విని "ఎందుకు ఏడుస్తున్నావు?" అని అడిగింది.

"ఒక్క రాత్రిలో పూర్తిచెయ్యడం అసంభవం అయిన పని చెయ్యమని పాము నన్ను ఆజ్ఞాపిస్తే ఏడవక మరేం చెయ్యను?" అన్నాడతను.

"ఏంటీ?" అని ఆమె అడిగింది. వేటగాడి కొడుకు పూసగుచ్చినట్టు మొత్తం చెప్పాడు.

"నన్ను పెళ్లి చేసుకో, ఆ పాము అడిగినవన్నీ చేసి పెడతాను," అంది ఆ కన్య.

"సరే, మరి!"

"ఊఁ, వెళ్లి పడుకో. పొద్దున్నే లే, పాముకి రొట్టె తీసుకు వెళుదువుగాని."

వేటగాడి కొడుకు పడుకున్నాడు. ఆ కన్య అడవిలోకి వెళ్లి ఈల వేసింది. చిత్రం! చెట్లన్నీ ఫెళ ఫెళ చప్పుడు చేస్తూ విరిగి పడిపోయాయి. నేలంతా సాపు అయిపోయింది. ఇలా సాపు అవుతూనే అలా గోధుమ విత్తులు చల్లడం, పంట పండడం అయిపోయింది. ఆ పిండితో రొట్టెని కాల్చే వేళకి ఇంకా తెల్లవారలేదు. ఆమె దగ్గరనుంచి రొట్టె తీసుకుని వేటగాడి కొడుకు పాము దగ్గరికి వెళ్లి బల్లమీద పెట్టాడు.

పాము లేచి పెరట్లోకి వచ్చింది. అడవికి బదులుగా పొలం ఉంది. ఎటు చూసినా గోధుమ మోళ్లూ, మోపులు కట్టిన గోధుమ కనిపించాయి.

"ఆఁ! చెయ్యమన్న పని చేశావు," అంది పాము వేటగాడి కొడుకుతో.

"నీ రెండో పరీక్ష. అదుగో కనిపిస్తోందే, ఆ కొండని బద్దలు చేసి నది నీరు అందులో పారేట్టు చెయ్యి. దానినుండీ నది ఒడ్డున కొన్ని కొట్టుగదులు కట్టు. వాటిలో గోధుమ నిలవ చెయ్యి. పడవలమీద వర్తకులు వస్తారు. ఆ గోధుమని వాళ్లకి అమ్మెయ్యి. ఈ పనంతా నేను తెల్లవారి లేచే లోపునే అయిపోవాలి," అంది.

వేటగాడి కొడుకు స్తంభం దగ్గరికి వెళ్లి ఏడ్చాడు.

"ఏం ఏడుస్తున్నావ్?" అని ఆ కన్య అడిగింది.

పాము చెయ్యమన్న పని గురించి వేటగాడు ఆమెకి చెప్పాడు.

"పోయి పడుకో. అన్నీ నేను చేసి పెడతాను," అందామె.

ఆమె ఈల వేసింది. రెప్ప మూసి తెరిచే లోపల కొండ బద్దలైంది. అందులోంచీ నది నీరు పారింది. నదీ తీరంలో కొట్టు గదులు ఏర్పాటైపోయాయి. వర్తకులు వచ్చారనీ, వాళ్ల పడవలకి సరుకు గబగబా ఎత్తాలని, ఆ కన్య అతన్ని నిద్ర లేపి చెప్పింది. అప్పటికింకా తెల్లవారలేదు.

పాము నిద్ర లేచింది. తను పురమాయించిన పని అంతా జరిగిపోవడం చూసి ఆశ్చర్యపోయింది.

"ఊఁ, ఇదిగో నువ్వు చెయ్యాల్సిన మూడో పని. చీకటి పడగానే నువ్వు బంగారు సీమ కుందేలుని పట్టుకుని నా దగ్గరికి తేవాలి," అని వేటగాడి కొడుకుతో చెప్పింది.

వేటగాడి కొడుకు ఆ రాతి స్తంభం దగ్గరికి వెళ్లి ఏడ్చాడు. పాము చెప్పిన మూడో పని ఏమిటని ఆ కన్య అడిగింది. అతడు చెప్పాడు.

"హు! ఇదివరకటి వాటికంటే ఇది కష్టమైన పని. సరే, పద, ఆ రాయి దగ్గరికి వెళదాం. నేను సీమ కుందేలుని కలుగులోనుంచి బయటికి తరుముతా. నువ్వు దాన్ని పట్టుకోవాలి. జాగ్రత్తగా గుర్తుంచుకో, ఏది వచ్చినా పట్టుకో, అదే సీమ కుందేలు," అని హెచ్చరించింది.

ఆమె కలుగులోకి వెళ్లి సీమ కుందేలుని బయటికి తరమడం మొదలుపెట్టింది. వేటగాడి కొడుకు అక్కడ నుంచుని దాని కోసం చూస్తూ ఉన్నాడు.

ఇంతలో ఉన్నట్టుండి బుసలు కొడుతూ కలుగులోనుంచి బయటికి వచ్చింది కట్ల పాము. వేటగాడి కొడుకు దాన్ని పట్టుకోకుండా వదిలేశాడు. ఆ కన్య బయటికి వచ్చింది.

"నాకు ముందు ఎవరూ రాలేదా?" అని అడిగింది.

"కట్ల పాము వచ్చింది. నన్ను కరుస్తుందేమోనని భయం వేసి పట్టుకోలేదు," అన్నాడు.

"అయ్యో తెలివితక్కువవాడా! కట్ల పాము వేషంలో వచ్చింది బంగారు సీమ కుందేలే. సరే! మళ్లీ నేను లోపలికి వెళతాను. ఎవరైనా వచ్చి లోపల బంగారు సీమ కుందేలు లేదని చెబితే నమ్మకు. ఏం వచ్చినా పట్టుకో."

ఆమె మళ్లీ కలుగులోకి వెళ్లింది. సీమ కుందేలుని బయటికి తరమడం మొదలుపెట్టింది. చిత్రం! ఒళ్లంతా ముడతలు పడిపోయిన ఒక ముసలమ్మ ఇవతలికి వచ్చింది.

"దేని కోసం నాయనా వెతుకుతున్నావ్," అని ఆమె వేటగాడి కొడుకుని అడిగింది.

"బంగారు సీమ కుందేలు, మామ్మా."

"గొప్పదానికోసమే వెతుకుతున్నావు. అలాంటిదేమీ అక్కడ లేదు."

ఆ ముసలమ్మ వెళ్లిపోయింది. పాము కన్య కలుగులోంచి బయటికి వచ్చింది. "ఏమిటీ, కుందేలు లేదా? ఎవరూ బయటికి రాలేదా?" అని అడిగింది.

"ఒక ముసలమ్మ తప్ప ఎవరూ రాలేదు. నేను దేని కోసం చూస్తున్నానో అడిగింది. నేను

చెప్పగానే బంగారు సీమ కుందేలులాంటిది ఏదీ లేదని చెప్పింది, ఆమెని ఒదిలేశాను," అని చెప్పాడు.

"మా గొప్ప పని చేశావ్. ఒదిలి ఉండకూడదు. ఎందుకంటే ముసలమ్మ వేషంలో ఉంది బంగారు సీమ కుందేలే. ఇక నీకు అలాంటిదేమీ దొరకదు. అందుకే నేనే సీమ కుందేలుగా మారిపోతాను. నన్ను పాము దగ్గరికి తీసుకెళ్లు, పాము ముందు ఒక కుర్చీలో నన్ను పెట్టు. జాగ్రత్త సుమా, పాముని నన్ను తాకనివ్వకు. తాకనిచ్చావో నేనెవరైందీ పాము కనిపెట్టేస్తుంది. నిన్నూ నన్నూ కూడా సఫా చేస్తుంది," అని చెప్పింది.

ఆమె బంగారు సీమ కుందేలుగా మారిపోయింది. వేటగాడి కొడుకు దాన్ని పాము దగ్గరికి తీసికెళ్లి కుర్చీలో పెట్టాడు.

"ఇదిగో నీ బంగారు సీమ కుందేలు. ఇక నేను వెళ్లొచ్చు కదా?" అన్నాడు.

"ఊఁ, వెళ్లు," అంది పాము.

వేటగాడి కొడుకు వెళ్లిపోయాడు. పాము ఇంట్లోనుంచి బయటికి వెళ్లగానే ఆ కన్య తన మామూలు రూపానికి మారిపోయింది. గబగబా బయటికి పరిగెత్తివెళ్లి వేటగాడి కొడుకుని కలుసుకుంది. వాళ్లు ఇద్దరూ పిక్క బలంకొద్దీ పరిగెత్తారు.

పాము ఇంటికి తిరిగి వచ్చింది. జరిగిన మోసం తెలుసుకుని తన భర్తని వాళ్ల వెంట తరిమింది.

ఆ కన్యకీ, వేటగాడికీ తమ కాళ్ల కింద నేల అదురుతున్నట్టూ, కంపిస్తున్నట్టూ అనిపించింది.

"మనల్ని వెంబడిస్తున్నారు. నేను గోధుమ పొలంగా మారిపోతాను. నువ్వు ముసలి కాపలావాడిలా అయిపో. ఒక అబ్బాయీ, అమ్మాయీ ఇలా పరిగెత్తి వెళ్లారా అని నిన్ను అడుగుతారు. వెళ్లారనే చెప్పు. కాని గోధుమ నాట్లు అప్పుడు వెళ్లారు అని చెప్పాలి," అంది.

ఆ మగ పాము అంతలోనే అక్కడికి చేరింది. తిన్నగా కాపలావాడి దగ్గరికి వెళ్లింది.

"ఒక అబ్బాయీ, అమ్మాయీ ఇలా వెళ్లడం చూశావా?"

"చూశాను."

"ఎప్పుడు వెళ్లారు?"

"గోధుమ నాట్లప్పుడు."

'ఈ గోధుమ కోతకి వచ్చింది. వాళ్లు వెళ్లింది నిన్న,' అనుకొని ఆ మగ పాము వెనక్కి పోయింది.

ఆ కన్యా, వేటగాడి కొడుకూ మళ్లీ మామూలు రూపాలకి మారిపోయి పరుగుతీశారు. కొంతకాలం గడిచింది. మగ పాము ఇల్లు చేరింది.

"అయితే పట్టుకోలేదన్నమాట! దారిలో ఎవరన్నా తగిలారా నీకు?" అని పాము అడిగింది.

"ఎవరూ తగల్లేదు. గోధుమ పొలం కాపలా కాసే ముసలాడొకడు కనిపించాడు. ఎవరైనా అబ్బాయీ, అమ్మాయీ ఆ దారిన వెళ్లారా అని అడిగాను. గోధుమ నాట్లప్పుడు వెళ్లారని చెప్పాడు. కాని నేను వెళ్లేప్పటికి గోధుమ కోతకి వచ్చింది. అందుకని నేను వెనక్కి వచ్చాను."

“అయ్యో! నువ్వా ముసలాడిని చంపేసి గోధుమ పొలాన్ని మడదొక్కెయ్యాల్సింది. ఆ వేషంలో ఉన్నది ఆ కన్యా, వేటగాడి కొడుకూనూ! మళ్లీ వాళ్ల వెంటపడు, ఈసారి వాళ్లని చంపెయ్యి,” అంది పాము.

మగ పాము పారిపోతూన్న ఆ జంట వెంటపడింది. కాళ్ల కింద భూమి అదురుతోందని కన్య కనిపెట్టింది.

“మళ్లీ మనల్ని తరుముతున్నారు, దగ్గరికి వచ్చేశారు. నేను పాడు పడిన కోటలాగా మారిపోతాను. నువ్వు ముసలి సైనికుడిగా మారిపో. ఆ మగ పాము వచ్చి ఒక అబ్బాయీ, అమ్మాయీ ఈ దారిన వెళ్లడం చూశావా అని అడిగితే, చూశాను. ఈ దుర్గం కడుతూ ఉన్నప్పుడు అని చెప్పాలి,” అంది కన్య.

మగ పాము పరిగెత్తుకుంటూ సరాసరి వాళ్ల దగ్గరికి వచ్చింది.

“ఒక అబ్బాయీ, అమ్మాయీ ఈ దారిన వెళ్లడం చూశావా?” అని మగ పాము అడిగింది.

“చూశాను, కానీ ఈ దుర్గం కడుతూ ఉన్నప్పుడు,” అని సైనికుడు జవాబు చెప్పాడు.

‘కనీసం వంద ఏళ్లనాడు దీనిని కట్టి ఉంటారు. వాళ్లు నిన్ననే పారిపోయారు,’ అనుకొని మగ పాము వెనక్కి తిరిగి ఇంటికి పోయింది.

“ఒక దుర్గాన్నీ, ముసలి సైనికుడినీ చూశాను. ఆ పారిపోయిన వాళ్ల గురించి అడిగాను. ఆ దుర్గాన్ని కడుతూ ఉన్నప్పుడు తను వాళ్లని చూశానని చెప్పాడు. వాళ్లు మనం వెతికేవాళ్లు కాదని అనుకున్నాను. ఎందుకంటే, ఆ దుర్గాన్ని కనీసం వంద ఏళ్లముందు కట్టి ఉంటారు,” అని మగ పాము చెప్పింది.

“నువ్వా ముసలాడిని చంపేసి ఆ దుర్గాన్ని కూల గొట్టెయ్యాల్సింది. ఆ రూపంలో ఆ అమ్మాయీ, వేటగాడి కొడుకూ ఉన్నారు,” అంది పాము. “సరే నేనే వెడతాలే,” అని తనే బయలుదేరింది.

రెప్పపాటులో ఆ పాము దూసుకుపోయింది. అది ఎంత వేగంగా పరిగెత్తిందంటే కాళ్ల కింద భూమి అదిరింది, కంపించింది. ఆ కన్య నేలమీద చెయ్యి పెట్టి చూసింది. నేల వేడిగా తగిలింది.

“మన పని అయిపోయింది, ఈసారి వచ్చేది ఆడపామే. నిన్ను నదిగా మార్చేస్తాను, నేను చేపగా మారిపోతాను,” అంది కన్య.

అలాగే చేసింది. ఆడపాము గబగబా వచ్చి, నదిని చూసింది. తను పెద్ద చేపలాగా మారిపోయి చిన్న చేపని వెంట తరిమింది. కాని దాన్ని పట్టుకుందామని ప్రయత్నించిన ప్రతిసారీ చిన్న చేప ముళ్లలాంటి రెక్కలని పెద్దచేపకేసి తిప్పి పక్కకి పోయేట్టు చేసింది. దాంతో పెద్దచేప చిన్నచేపని వెంబడించడం మానుకుని నదిలో ఉన్న నీళ్లన్నిటినీ తాగెయ్యాలనుకుంది. నీళ్లన్నిటినీ తాగితాగి దాని కడుపు ఉబ్బరించుకుని పొట్ట బద్దలై చచ్చిపోయింది.

ఆ కన్యా, వేటగాడి కొడుకూ అసలు రూపాలకి మారిపోయారు.

"ఇంక మనకి భయం లేదు. పద మీ ఇంటికి వెళదాం. మీ వాళ్లని చూసినప్పుడు నువ్వు మీ పిన తండ్రి కొడుకుని తప్ప అందరినీ ముద్దు పెట్టుకుని కౌగలించుకో. ఏమంటే వాడిని ముద్దు పెట్టుకుంటే నువ్వు నన్ను మరిచిపోతావు," అంది.

వాళ్లు ఊళ్లోకి వచ్చారు. ఆ కన్య ఒక పనిపిల్లలా ఒక గ్రామస్థుడి ఇంట్లో పనికి చేరింది. వేటగాడి కొడుకు తన ఇంటికి వెళ్లాడు. పిన తండ్రి కొడుకుని తప్ప అందరినీ కౌగలించుకుని ముద్దు పెట్టుకున్నాడు. కాని వాడిని ముద్దు పెట్టుకోకపోతే ఇంట్లో వాళ్లు కష్టపెట్టుకుంటారేమో అనిపించి వాడినీ ముద్దు పెట్టుకున్నాడు. వెంటనే ఆ కన్య గురించి పూర్తిగా మరిచిపోయాడు.

ఆర్నెల్లు గడిచాయి. ఇక పెళ్లి చేసుకోవాలని అనుకున్నాడు. ఒక ముచ్చటైన అమ్మాయిని వెతికారు. అతను ఆమెని ప్రేమించాడు. తనని పాము బారినుండి రక్షించిన ఆ కన్య విషయమే అతనికి గుర్తులేదు.

పెళ్లి ముందు రోజు సాయంత్రం ఊళ్లో ఉన్న పడుచు అమ్మాయిలందరినీ రొట్టెలు చేసేందుకు పెళ్లి కొడుకు ఇంటికి పిలిచారు. అమ్మాయిల్లో ఆ కన్య కూడా ఉంది. ఆ అమ్మాయిలందరూ పని మొదలుపెట్టారు. పావురాల ఆకారంలో రెండు రొట్టెలని కన్య చేసి పైకి ఎగరేసింది. వాటికి ప్రాణం వచ్చి కూయడం మొదలుపెట్టాయి.

"నేను మొత్తం అడవిని సమూలంగా పెకలించి గోధుమ నాటి, రొట్టె చేసి పాము దగ్గరికి తీసికెళ్లి ఇమ్మని నీకిచ్చాను గుర్తుందా?" అని ఒక పావురం అడిగింది.

"ఉహూఁ, నాకేం గుర్తులేదు," అని రెండో పావురం జవాబు చెప్పింది.

"నేను ఒక కొండను పగలగొట్టి నదిని పారించి, దానిమీద పడవల్లో వర్తకుల్ని రప్పించి నువ్వు వ్యాపారం చేసేట్టు చేశాను గుర్తుందా?" అని మొదటి పావురం అడిగింది.

"ఊహూఁ నాకేం గుర్తులేదు," అంది రెండో పావురం.

"ఒక బంగారు కుందేలు కోసం ఇద్దరం కలిసి ఎలా వేటాడామో గుర్తుందా?" అని మొదటి పావురం మళ్లీ అడిగింది.

"ఊహూఁ నాకేం గుర్తులేదు," అని రెండో పావురం జవాబు చెప్పింది.

అప్పుడు వేటగాడి కొడుక్కి జరిగిందంతా గుర్తు వచ్చింది. సంబంధం కుదుర్చుకున్న అమ్మాయిని కాకుండా, తను నిజంగా ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. వాళ్లిద్దరూ సుఖంగా కాపురం చేశారు.





మంచి పుస్తకం
ISBN 978-93-80153-59-9